

# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శనివారం 04 సెప్టెంబరు 2021 | సంపుటి : 03 | సంచిక : 31 | పేజీలు : 4 | వెల : రూ 3-00


## పరిశ్రమలకు ప్రోత్సాహకాలు విడుదల చేసిన సీఎం జగన్

అమరావతి: ఎంఎస్ఎంఈ, స్పిన్నింగ్, టెక్స్‌టైల్ పరిశ్రమలకు రూ. 1,124 కోట్ల ప్రోత్సాహకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి కంప్యూటర్ బటన్ నొక్కి ఈ నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, చిన్న తరహా పరిశ్రమలను ఆదుకునేందుకు నేడు శ్రీకారం చుట్టామని తెలిపారు. 10 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. పరిశ్రమలు తెచ్చేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నామని.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.



కరోనా కష్టకాలంలో వరుసగా రెండో ఏడాది కూడా పరిశ్రమలకు ప్రోత్సాహక రాయితీలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. కరోనా విపత్తు వల్ల రాష్ట్రంలో ఒక్క పరిశ్రమ కూడా మూతపడకూడదన్న లక్ష్యంతో గత ఏడాది మే 22న దేశంలోనే తొలిసారిగా రీస్టార్ట్ ప్యాకేజీ పేరుతో రూ. 1,100 కోట్ల ప్యాకేజీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పుడు కరోనా సెకండ్ వేవ్‌తో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిశ్రమలను ఆదుకునేందుకు ఈ ఏడాది కూడా ఎంఎస్ఎంఈలు, టెక్స్‌టైల్, స్పిన్నింగ్ మిల్లులకు రూ. 1,124 కోట్ల ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంక రవీంద్రనాథ్, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవింద రెడ్డి, ఏపీఐడీసీ చైర్మన్ బండి పుణ్యశీల, ఏపీ మ్యారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ కరికాల వలవన్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ జవ్వాది సుబ్రహ్మణ్యం, పరిశ్రమల శాఖ సలహాదారులు శ్రీధర్ లంక, రాజీవ్ కృష్ణ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గతంలో హడావుడి ఎక్కువ.. పని తక్కువ: సీఎం జగన్

**రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తుంటే.. టీడీపీ, ఎల్లోమీడియా దుష్ప్రచారం**

**పరిశ్రమలు తీసుకొచ్చేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నాం**

**ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి**



అమరావతి: తమ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తుంటే.. టీడీపీ, ఎల్లోమీడియా దుష్ప్రచారం చేస్తున్నాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఎస్ఎంఈ, స్పిన్నింగ్, టెక్స్‌టైల్ పరిశ్రమలకు శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి రూ. 1,124 కోట్ల ప్రోత్సాహకాల విడుదల సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "పరిశ్రమలు తీసుకొచ్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం. పరిశ్రమలకు ప్రకటించిన రాయితీలన్నీ అమలు చేస్తున్నాం. కొనుగోలు చేసే శక్తి ప్రజలకు లేకపోతే పరిశ్రమలు మూతపడతాయి. 25 సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలు ఆపలేదు' అని సీఎం అన్నారు. ఎంఎస్ఎంఈలను ఆదుకునేందుకు, అదే రకంగా స్పిన్నింగ్ మిల్స్‌ను ఆదుకునేందుకు ఇవాళ ఈ గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. తమకు తాము శ్రమ చేస్తూ మరో 10 మందికి ఉద్యోగాలు కల్పించే కార్యక్రమాన్ని ఎంస్ఎంఈలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 97,423 మంది ఎంఎస్ఎంఈలు నడుపుతున్నారని మరో 10 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని సీఎం అన్నారు. "ఇలాంటి రంగాన్ని ఆదుకోవడం అంటే.. రాష్ట్రం ప్రభుత్వం ఒక మాట చెప్తే.. చేస్తుంది అని నమ్మకం కల్పించడం అంటే.. పరిశ్రమలను పెట్టడానికి విశ్వాసం కల్పించడమే. మధ్యతరహా పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టేవారుసహా వీరందరినీ కాపాడగలిగితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కాపాడినట్టు అవుతుంది. వ్యవసాయంతో పాటు పరిశ్రమలు కూడా జీడీపీకి దోహదపడతాయి. గతంలో మాదిరిగా హడావిడి ఎక్కువగా ఉంటేది. పెద్ద పెద్ద సదస్సులు పెట్టేవారు, కాగితాల మీద అగ్రిమెంట్లు పెట్టుకునేవారు, ఆ రోజుల్లో అక్కడ ఏమీ జరక్కముందే.. మైక్రోసాఫ్ట్ వచ్చేసింది.. ఎయిర్‌బస్ వచ్చేసింది అని మరో రోజు, బుల్లెట్ రైలు వచ్చేసిందని మరో రోజు ఇలా హెడ్‌లైన్స్ పెట్టి రాసేవారు. ఇటువంటి పరిస్థితులన్నీ కూడా పక్కనపెట్టి ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమాలు చేయకుండా నిజంగానే పరిశ్రమలను తీసుకురావడానికి అడుగులు ముందుకేస్తున్నాం. పరిశ్రమలు ఎక్కడ వస్తున్నాయో.. మన కళ్లముందే కనిపిస్తున్నాయి. ఉద్యోగ అవకాశాలు కూడా మన కళ్లముందే కనిపిస్తున్నాయి. పరిశ్రమలు రావాలంటే... దానికి అనుకూల వాతావరణం ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇన్సెంటివ్ అనేదాన్ని చెప్తే.. దాన్ని ఇచ్చేలా ఉండాలి. ఇవాళ ప్రపంచవ్యాప్తంగా కూడా పరిస్థితులను చూస్తే... ఆర్థిక వ్యవస్థ మందగమనం కనిపిస్తోంది. అనుకూలతలేని పరిస్థితులనుంచి కూడా ప్రజలను కాపాడుకోవాలి, ఒక వేళ డిమాండ్ తగ్గకుండా చూసుకుంటూ, మరోవైపు పరిశ్రమలను నిలబెట్టే కార్యక్రమాలు చేయాలి. ఇదే దిశగానే అడుగులు వేస్తూనే ముందుకు పోవడం జరుగుతుంది. పరిశ్రమలు రావడమే కాదు, కొనుగోలు శక్తి ప్రజలకు ఉన్నప్పుడే ఆ పరిశ్రమలు నిలబెడతాయి. అది లేకపోతే.. ఆ సైకిల్ దెబ్బతింటుంది, పరిశ్రమలు తీవ్రంగా నష్టపోతాయి, మూతబడే పరిస్థితి ఉంటుంది. కోవిడ్ పరిస్థితుల్లో ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకే దాదాపు 22 సంక్షేమ అభివృద్ధి పథకాలను తీసుకు వచ్చాం. ఒక రూపాయి కూడా అవినీతి లేకుండా వివక్షకు ఆస్కారం ఇవ్వకుండా ప్రతి పేద లబ్ధిదారునికి డీబీటీ పద్ధతిలో వారి అక్కౌంట్లోకి వేస్తున్నాం. ఈ 27 నెలలకాలంలో మన ఇచ్చిన డబ్బు కుటీర, మధ్యతరహా పరిశ్రమలను నిలబెట్టగలిగాయి, అంతేకాకుండా ఉపాధిని నిలబెట్టడానికి ఉపయోగపడ్డాయి. ఇలాంటి కష్టకాలంలో కూడా ప్రజల కొనుగోలు శక్తి నిలబెట్టగలిగాం. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఉన్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా మైనస్ 5శాతం ఉన్నప్పటికీ మన రాష్ట్రంలో అలాంటి పరిస్థితులకు ఆస్కారం లేకుండా మన రైతును, మన వెనకబడ్డ వారిని నిలబెట్టుకోగలిగాం. గ్రోత్‌రేట్ చిన్నదే అయినా నిలబెట్టుకోగలిగాం. అప్పోసప్పో చేసైనా సరే అందించిన డబ్బే ఒక రాష్ట్రానికైనా, దేశానికైనా సంజీవని అవుతుందని అంతర్జాతీయ ఆర్థిక వేత్తలు చెప్పినమాట. కాని దురదృష్టవశాత్తూ ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ?5 లాంటివాళ్లు, తెలుగు దేశం పార్టీవాళ్లు..... ప్రజలను కాపాడుకునేందుకు అప్పోసప్పో చేసే కార్యక్రమాన్ని చేస్తే దాన్ని కూడా నెగెటివ్‌గా చూపించే అధ్వాన్న పరిస్థితులు మన రాష్ట్రంలో కనిపిస్తున్నాయి. వీళ్లు ఎలాంటి నెగెటివ్ కార్యక్రమాలు చేసినా.. దేవుడి దయతో మంచి చేయాలనుకున్న కార్యక్రమాలను చేస్తాం.

## ప్రధాని నరేంద్ర మోదీతో సీఎం కేసీఆర్ భేటీ

న్యూఢిల్లీ : ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై మోదీతో కేసీఆర్ చర్చించే అవకాశం ఉంది. రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులతో పాటు కృష్ణా, గోదావరి బోర్డుల గెజిట్‌పై చర్చించనున్నట్లు సమాచారం. ఈ నెల 1వ తేదీన ఢిల్లీకి వెళ్లిన సీఎం కేసీఆర్.. నిన్న మధ్యాహ్నం 1:48 గంటలకు వసంత్ విహార్‌లో తెలంగాణ



భవన్ నిర్మాణానికి భూమి పూజ చేసిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఏపీ పోలీస్ శాఖకు 5 జాతీయ అవార్డులు: డీజీపీ గౌతమ్ సవాంగ్



అమరావతి: ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖకు అయిదు జాతీయస్థాయి అవార్డులు వచ్చాయని డీజీపీ గౌతమ్ సవాంగ్ తెలిపారు. ఈ అయిదు అవార్డులు కూడా టెక్నాలజీ విభాగంలో వచ్చాయని వెల్లడించారు. ఈ రోజు ఏపీ పోలీసులు గర్వించదగ్గ రోజని పేర్కొన్నారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ ద్వారా ఏపీ పోలీసు శాఖలోని సిబ్బంది ఆరోగ్య సమాచారమంతా పొందుపరచామని, దీనికి కూడా అవార్డు దక్కిందన్నారు. పాస్‌పోర్ట్ సేవలోనూ దేశంలోనే ఏపీ అగ్రస్థానంలో ఉందని డీజీపీ తెలిపారు. పాస్‌పార్ట్ వెరిఫికేషన్ టెక్నాలజీ సాయంతో చేస్తున్న విధానం జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలబెట్టిందన్నారు. గడిచిన రెండేళ్లలో ఇప్పటి వరకు 130 అవార్డులు ఏపీ పోలీస్ శాఖకి దక్కాయయని, ఈ అవార్డులు పోలీస్ శాఖపై మరింత బాద్యత పెంచాయని పేర్కొన్నారు. అవార్డులు పెరుగుతున్న కొద్దీ శాఖ పనితీరుని మరింతగా మెరుగుపరుచుకుంటున్నామన్నారు. కోవిడ్ సమయంలోఘేపీ పోలీస్ పనితీరు ప్రశంసలు అందుకుందని చెప్పారు. 'దిశ యాప్, మహిళల రక్షణపై ఏపీ పోలీసు శాఖకి ఇప్పటివరకు 17 అవార్డులు వచ్చాయి. మహిళల రక్షణ కోసం ఏపీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందది. సీఎం వైఎస్ జగన్ దిశ యాప్ ప్రారంభించిన తర్వాత నుంచి రాష్ట్రంలో 46,66,841 మంది ఇప్పటి వరకు ఈ యాప్ డౌన్ లోడ్ చేశారు. దిశ యాప్‌తో మహిళలకి దైర్యం వచ్చింది. దిశ యాప్‌తో అన్ని విధాల రక్షణ లబిస్తుందని మహిళలు భావిస్తున్నారు. రోజుకి 4 వేల వరకు కాల్స్ వస్తున్నాయి. దిశ యాప్ ఒక్కదానికే గతంలో మూడు జాతీయ అవార్డులు వచ్చాయి. పోలీస్ సేవా యాప్‌ను ఇప్పటి వరకు 7 లక్షల పైన డౌన్‌లోడ్ చేసుకున్నారు. పోలీస్ సేవా యాప్ ద్వారా ప్రజలకి ఎన్నో సేవలు అందిస్తున్నాం. పోలీస్ శాఖలో పారదర్శకతకి ఈ పోలీస్ సేవా యాప్ ద్వారా పెద్ద పీట వేస్తున్నాం. ప్రతీ సోమవారం అన్నిజిల్లాల ఎస్పీ కార్యాలయాలలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేయడానికి మహిళలు ఎక్కువ సంఖ్యలో ముందుకు వస్తున్నారు. ఏపీలో స్పందన కార్యక్రమం ద్వారా 38 వేల ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశాం' అని వెల్లడించారు.

## 5న రాష్ట్రానికి కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ రాక

బెంగళూరు: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 5న రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. హుబ్బళ్లిలో గురువారం ఈ విషయాన్ని ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై



మీడియాకు వెల్లడించారు. పెట్రోలియం ఉత్పత్తుల ధర పెరుగుదలతో పాటు పలు కీలక అంశాలపై నిర్మలా సీతారామన్‌తో తాను చర్చలు జరుపుతానన్నారు. ప్రత్యేకించి పెట్రోలియం ఉత్పత్తులు, వంటగ్యాస్ పెరుగుదలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్న సీఎం కొంత మేరకు ఈ భారాన్ని తగ్గించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామన్నారు. పెట్రోలియం ఉత్పత్తులు, వంటగ్యాస్ ధరల పెరుగుదలకు అంతర్జాతీయ మార్కెట్టే కారణమని సీఎం వివరించారు. కేంద్రంలో ఒకవేళ యూపీఏ ప్రభుత్వం ఉన్నా ఈ విషయంలో ఏమీ చేయడం సాధ్యమయ్యేది కాదన్నారు. పెట్రోలియం సెస్ తగ్గింపుపై విజ్ఞప్తులు వస్తున్నాయని, తగిన సమయంలో నిర్ణయం తీసకుంటామని సీఎం వివరించారు.

## విశాఖ బీచ్‌కు చేరుకున్న స్వర్ణ విజయ్ వర్ష్ జ్యోతి

**రక్షణ శాఖ మాజీ ఉద్యోగులకు రాయితీలు ఇస్తున్నట్లు వెల్లడి**



విశాఖపట్టణం: మాజీ సైనికులకు ఏపీ ప్రభుత్వం అండగా ఉంటుందని హోం మంత్రి సుచరిత తెలిపారు. రక్షణ శాఖ మాజీ ఉద్యోగులకు రాయితీ ద్వారా పరిశ్రమలు.. స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పాకిస్తాన్‌పై భారత్ విజయానికి సూచికగా చేపట్టిన స్వర్ణ విజయ్ వర్ష్ జ్యోతిని శుక్రవారం ఆర్కే బీచ్‌లోని విక్టరీ ఎట్ సీ వద్ద జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తూర్పు నౌకదళ ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ అజేంద్ర బహుదూర్ హోంమంత్రికి అందజేశారు. నాటి విజయంలో భాగస్వాములైన నేవీ సిబ్బందిని మంత్రి సత్కరించారు. స్వర్ణ విజయ్ వర్ష్ జ్యోతిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. విశాఖలో నేవీ అవసరాలు తీర్చడానికి సీఎం జగన్మోహన్ రెడ్డి పూర్తిగా సహకరిస్తున్నారని తెఉలిపారు. భారత్ రక్షణలో విశాఖ తీరం కీలకమని మంత్రి అవంతిశ్రీనివాసరావుతెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సైనికులు నాటి యుద్ధ జ్ఞాపకాలని గుర్తు చేసుకున్నారు.

## కర్నూలు జిల్లా పంచాయతీ అధికారికి హైకోర్టు షాక్

అమరావతి: కర్నూలు జిల్లా పంచాయతీ అధికారి కె. ప్రభాకరరావుపై సుమోటోగా కోర్టు ధిక్కార చర్యలు ప్రారంభించాలని రిజిస్ట్రార్‌ను హైకోర్టు ఆదేశించింది. కోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించి పంచాయతీ సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేయడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. జి.సింగవరం పంచాయతీ సర్పంచ్ చెక్ పవర్‌ను తాజాగా రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఇచ్చిన ఉత్తర్వులను కోర్టు కొట్టివేసింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న గ్రామ సచివాలయం నిర్మాణం నిలిపివేయాలని, డబ్బు కోసం సర్పంచ్‌ను ఒత్తిడి చేయవద్దని గతంలో హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా మళ్లీ చెక్ పవర్ రద్దు చేయడంపై పిటిషనర్ హైకోర్టును



ఆశ్రయించింది. పంచాయతీ కార్యదర్శి ద్వారా డబ్బు ఇప్పించేందుకు ప్రయత్నం చేస్తున్నారని పిటిషనర్ తరపు న్యాయవాది యలమంజుల బాలాజి కోర్టుకు తెలిపారు. గతంలో ఇచ్చిన ఉత్తర్వులను ధిక్కరించడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చర్యలు ప్రారంభించాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

## త్వరలోనే బయటకు 'మాన్సాస్' అవినీతి: విజయసాయిరెడ్డి

సింహాచలం: మాన్సాస్ ట్రస్ట్‌లో చాలా అవినీతి జరిగిందని.. దీనిపై తెదేపా సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజుతో చర్చకు సిద్ధమని వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి ప్రకటించారు. సింహాచలం అప్పన్న స్వామిని దర్శించుకున్న అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. మాన్సాస్ ట్రస్ట్‌లో జరిగిన అవినీతిని త్వరలోనే బయటపెడతామని చెప్పారు. దర్యాప్తు వేగవంతంగా జరుగుతోందని.. బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. భూ ఆక్రమణలు ఎవరు చేశారో విచారణలో బయటపడుతుందన్నారు.



## మార్గదర్శకాలు రూపొందించే నాటికి.. మూడో వేవ్ ముగుస్తుంది!

**కేంద్రం తీరుపై సుప్రీం కోర్టు అసంతృప్తి**

ఢిల్లీ: కొవిడ్ మహమ్మారి కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు పరిహారం అందించడంలో కేంద్ర ప్రభుత్వం వైఖరిపై సుప్రీం కోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఆదేశాలు ఇచ్చినప్పటికీ పరిహారం, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి మార్గదర్శకాలు రూపొందించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన కోర్టు, అవి రూపొందించే నాటికి మూడో వేవ్ కూడా ముగుస్తుందేమోననే అభిప్రాయం వ్యక్తం చేసింది. 'కొవిడ్ మరణాలకు సంబంధించి మరణ ధ్రువీకరణ పత్రాల జారీ కోసం మార్గదర్శకాలను రూపొందించాలని చాలా రోజుల కిందటే ఆదేశాలు ఇచ్చాం. వాటిని ఇప్పటికే ఒకసారి పొడిగించాం. మీరు మార్గదర్శకాలు రూపొందించే నాటికి మూడో వేవ్ కూడా ముగిసిపోతుంది' అని జస్టిస్ ఎం ఆర్ షా, జస్టిస్ అనిరుద్ధ బోస్‌లతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అంతేకాకుండా కొవిడ్‌తో మరణించిన బాధిత కుటుంబాలకు పరిహారం అందించాలని జూన్ 30న ఇచ్చిన ఆదేశాలనూ ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించింది. ముగియనున్న నేపథ్యంలో ఆ సమయంలోగా పరిహారం చెల్లింపుపై కేంద్రం ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. వీటికి సంబంధించి సెప్టెంబర్ 11లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ సందర్భంగా కేంద్ర తరపున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. కోర్టు ఆదేశాలన్నీ ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని సుప్రీం ధర్మాసనానికి హామీ ఇచ్చారు

# సంపాదకీయం

శనివారం 04 సెప్టెంబరు 2021

## ప్రభుత్వ ఏర్పాటు దిశగా తాలిబన్లు

అమెరికా భద్రతా దళాలు వెళ్లిపోవడంతో ఆఫ్ఘన్ లో అధికారికంగా అరాచకం మొదలైంది. రెండే రెండు రోజుల్లో ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్ రాజ్యం ఏర్పాటు కాబోతోంది. ఆఫ్ఘన్ లో ఏర్పాటు కాబోతున్న కొత్త ప్రభుత్వానికి తాలిబన్ అగ్రనేత హీబాతుల్లా అఖుంద్‌జాదా నాయకత్వం వహించనున్నారు. కొత్త ప్రభుత్వంలో ఎవరెవరు ఉండబోతున్నారో కూడా తాలిబన్ హైకమాండ్ ఫైనలైజ్ చేసింది. మరి, తాలిబన్ ప్రభుత్వం ఎలా ఉండబోతోంది? ఎలాంటి విధివిధానాలు ఉండబోతున్నాయ్? మహిళలకు ప్రాధాన్యత ఉంటుందా? మహిళల మనసులు గెలుచుకునేలా విధానాలు ఉంటాయా? ఎలాంటి మోడల్ ను తాలిబన్స్ ప్రపంచం ముందు ఉంచబోతున్నారు? ఆఫ్ఘన్లను ఆకట్టుకోవడానికి ఏం చేయబోతున్నారు? వీటిపైనే ప్రపంచం మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఒకట్రెండు రోజుల్లోనే న్యూ గవర్నమెంట్ బ్లూప్రింట్ తో ప్రపంచం ముందుకు రాబోతున్నారు తాలిబన్స్. ఇస్లామిక్ ఎమిరేట్స్ ఆఫ్ ఆఫ్ఘనిస్తాన్ పేరుతో విధానాలను ప్రకటించనున్నారు. అయితే, తాలిబన్ల పేరు చెబితేచాలు నిలువెల్లా వణికిపోయే ఆఫ్ఘన్ మహిళల్లో భయాందోళనలను పోగొట్టేవిధంగా విధివిధానాలు ఉంటాయా? లేదా? అన్నదే ఆసక్తి రేపుతోంది.ప్రపంచం మొత్తం తమ ప్రభుత్వాన్ని గుర్తించాలని తాలిబన్లు ఆశిస్తున్నారు. అందుకే, అంతర్జాతీయ ఆమోదం లభించే నేత కోసం అన్వేషిస్తున్నారు. ఆఫ్ఘన్ లో ఏర్పాటు కాబోతున్న కొత్త ప్రభుత్వానికి తాలిబన్ అగ్రనేత హీబాతుల్లా అఖుంద్‌జాదా నాయకత్వం వహించినా, అతని అండర్ లో ప్రైమ్ మినిస్టర్ లేదా ప్రెసిడెంట్ పనిచేసేలా కీలక పోస్టును క్రియేట్ చేయబోతున్నట్లు తెలుస్తోంది.ఆఫ్ఘనిస్తాన్ వార్తా సంస్థ నివేదిక ప్రకారం, తాలిబాన్ ఆఫ్ఘన్ నాయకుల మధ్య చర్చలు పూర్తయిన తర్వాత కాబూల్ కొత్త ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వాన్ని ప్రకటించబోతోంది. తాలిబాన్ నాయకుడు హెబతుల్లా అఖుంద్‌జాదా కొత్త ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తారని, ఒక ప్రధాని లేదా అధ్యక్షుడు తాలిబాన్ నాయకుడి కింద పనిచేసే అవకాశం ఉందని పేర్కొంది.కాబూల్ విమానాశ్రయం నుండి యుఎస్ దళాలు బయలుదేరిన ఒక రోజు తర్వాత, ఖతారీ సాంకేతిక నిపుణుల బృందం విమానాశ్రయ కార్యకలాపాల పునఃప్రారంభం గురించి చర్చించడానికి రాజధానిలో అడుగుపెట్టింది. చర్చ కొనసాగుతోందని ఆఫ్ఘనిస్తాన్ ప్రారంభించిందని నివేదిక పేర్కొంది.మరో వైపు ఆఫ్ఘనిస్తాన్.. తాలిబన్ల చేతుల్లోకి వెళ్లిన తరువాత.. రోజుకో కీలక పరిణామాలు చోటు చేసుకుంటూ వస్తోన్నాయి. ఆఫ్ఘానిస్తాన్ తాలిబన్ చేతుల్లోకి వెళ్లిపోవడంతో ఉగ్రవాదులు ఊపిరిపీల్చుకుంటున్నారు. ఇప్పటికే పాకిస్తాన్ సహా పలు దేశాల్లోని ఉగ్రవాదులు ఆఫ్ఘానిస్తాన్ కి తమ మకాం మారుస్తుండగా..తాజాగా అల్ ఖైదా ఉగ్రసంస్థకి చెందిన కీలక నేత అమిన్ ఉల్ హక్ అఫ్ఘానిస్తాన్‌లోని తన సొంత ఊరుకి తిరిగి చేరుకున్నాడు. మరోవైపు, తాలిబన్ల పరిపాలనలో ఆ దేశం మళ్లీ ఉగ్రవాదులకు షెల్టర్ జోన్‌గా మారుతుందనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.ఆఫ్ఘనిస్తాన్‌ను వదిలి వెళ్లిన ఉగ్రవాదులందరూ మళ్లీ స్వదేశానికి చేరుకుంటున్నారు. తాజాగా అల్ ఖైదా కీలక నేత అమీనుల్ హక్.. ఆఫ్ఘనిస్తాన్‌లో అడుగు పెట్టారు. తన సొంత రాష్ట్రం నంగర్‌హర్ ప్రావిన్స్‌కు చేరుకున్నారు. దీనికి సంబంధించిన ఓ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆఫ్ఘనిస్తాన్ తాలిబన్ల చేతుల్లోకి వెళ్లిన కొద్దిరోజులకే ఆయన స్వస్థలానికి చేరుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే అమిన్ ఉల్ హక్ ని వాహనంలో రావడం చూసిన అక్కడి తాలిబన్లలో కొందరు.. సెల్ఫీలు దిగడానికి ఎగబడడం విశేషం.ఒకట్రెండు రోజుల్లో అమీనుల్ హక్.. కాబుల్‌కు వెళ్తారని విదేశీ మీడియా అంచనా వేస్తోంది. తాలిబన్ల కీలక నేతలతో భేటీ అవుతారని వార్తలు వెలువడుతున్నాయి. అమిన్ ఉల్ హక్..2001లో న్యూయార్క్ లోని వరల్డ్ ట్రేడ్ టవర్లపై దాడిలో ప్రధాన సూత్రధారి. అమీనుల్ హక్.. ఒసామా బిన్ లాడెన్‌కు ముఖ్య అనుచరుడు. లాడెన్ సెక్యూరిటీ ఇన్‌ఛార్జ్ కూడా. లాడెన్ ఎక్కడికి వెళ్లినా.. అతని వెంటే ఉండేవాడు. 2008లో అతణ్ని పాకిస్తాన్ భద్రతాధికారులు అరెస్ట్ చేశారు. 2011లో విడుదల చేశారు. సుదీర్ఘకాలం పాటు తాలిబన్లతో కలిసి పనిచేసిన అనుభవం అమీనుల్ హక్‌కు ఉంది. ఇదివరకు తాలిబన్ల ప్రభుత్వం ప్రిసనర్ కమిషన్‌లో సైతం అతను పనిచేశాడు. ఒసామా బిన్ లాడెన్‌ను అమెరికా భద్రతా బలగాలు పాకిస్తాన్‌లోని అబోటాబాద్‌లో మట్టుబెట్టిన తరువాత తెరమరుగయ్యాడు. అమెరికా సైన్యం అమీనుల్ హక్ కోసం పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ జాడ దొరకలేదు.అయితే, తాజా ఆఫ్ఘానిస్థాన్‌లో పరిణామాల నేపథ్యంలో మళ్లీ తెర మీదకి వచ్చాడు. తన స్వస్థలం నంగర్‌హర్ ప్రావిన్స్‌కు చేరుకున్నాడు. త్వరలోనే తాలిబన్లతో భేటీ కాబోతోన్నాడు. ఇదివరకట్లాగే తాలిబన్ ప్రభుత్వంతో అసోసియేట్ అవుతాడనే అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఇస్లామిక్ స్టేట్ ఖొరాసన్ ప్రావిన్స్ చెలరేగిపోతోన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఆగ్నికి ఆజ్యం పోసినట్టు.. అల్ ఖైదా కూడా చాపకింద నీరులా తోడవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజా పరిణామాలను చూస్తుంటే ఉగ్రవాదులందరూ మళ్లీ తాలిబన్లతో జట్టు కట్టడానికి సిద్ధపడుతున్నట్లు కనిపిస్తుంది. ఇది ఎక్కడికి దారి తీస్తాయోననే భయాందోళనలకు కారణమవుతున్నాయి. భారత్ సహా అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు ఒకింత అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుందనే రక్షణ నిపుణులు హెచ్చరిస్తున్నారు

# చింతమనేని గ్రాఫ్ పెరుగుతోందా...



ఏలూరు, సెప్టెంబర్ 3, (న్యూస్ పల్స్)కొన్ని పరిణామాలు రాజకీయాలను చిత్రమైన మలుపులు తిప్పుతూ ఉంటాయి. ఇలాంటి పరిణామమే.. పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరు నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విషయంలోనూ చోటు చేసుకుందని అంటున్నారు పరిశీలకులు. నిజానికి ఆయనపై వ్యక్తిగతంగా అనేక మందికి అక్కసు ఉంది. నోరు విప్పితే.. మాట కుదరదని.. ఎప్పుడు ఏమూడ్‌లో ఉంటారో.. కూడా చెప్పలే మని.. ప్రజలు అదేపనిగా చర్చించుకుంటారు. అదే సమయంలో పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అనేక వివాదాలకు కేంద్రంగా మారారు.దీంతో గత ఎన్నికల్లో ఆయనకు వ్యక్తిగత అంశాలే వ్యతిరేకత పెంచి ఓడించాయి. నిజానికి వీటి నుంచి బయటకు వచ్చేందుకు చింతమనేని ప్రభాకర్ ప్రయత్నించనూ లేదు. పైగా.. ఇది ఆయనకు వ్యక్తిగత అంశం కావడంతో.. పార్టీ కూడా పట్టించుకోలేదు. గెలిస్తే.. గెలుస్తాం.. లేకుంటే లేదు అనే తరహాలోనే.. వ్యవహరించింది. పైగా నాడు చింతమనేని ప్రభాకర్ దూకుడు పట్ల చంద్రబాబు సైతం ఉదాసీన వైఖరితో ఉన్నారు. ఇది పార్టీపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రభావం చూపిన అంశాల్లో ఒకటి అయ్యింది.అయితే.. ఇప్పుడు జగన్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరితో చింతమనేని ప్రభాకర్ కి సింపతీ పెరుగుతోంది. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. చింతమనేని ప్రభాకర్ పై 36 కేసులు నమోదు చేయడం.. వెంట వెంటనే కేసులతో.. జైలు నుంచి బయటకు కూడా రాకుండా చేయడం.. వంటి పరిణామాలు.. ప్రజల మనసులు తాకుతున్నాయి. తాజాగా.. చింతమనేని ప్రభాకర్ పెట్రో ధరలపై నిరసన వ్యక్తం చేస్తున్న క్రమంలో పోలీసులకు, ఆయనకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో ఆయనపై చర్యలు తీసుకోవాలంటే.. అప్పటికప్పుడు తీసుకుని ఉండాలి.కానీ, 24 గంటలు వెయిట్ చేసి.. తర్వాత చింతమనేని ప్రభాకర్ ఎక్కడో విశాఖలోని నర్సీపట్నం వెళ్తే.. అక్కడ పోలీసులకు సమాచారం.. అరెస్టు చేయించారు. అయితే.. ఇదంతా వ్యూహం ప్రకారం జరిగిందనేది స్పష్టంగా తెలుస్తున్న విషయం. ఏదైనా ఉంటే.. అప్పటికప్పుడు కేసు నమోదు చేయాల్సిన పోలీసులు.. తర్వాత స్పందించడం వెనుక.. ఓ సలహాదారు ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే చింతమనేనిని అనవసరంగా అరెస్టు చేశారని టీడీపీ నేతలు ప్రచారం చేశారు.దీనిని ప్రజలు కూడా నమ్ముతుండడంతో.. ఇప్పటి వరకు చింతమనేని ప్రభాకర్ పై ఉన్న విమర్శల కన్నా.. ఈ సింపతీ ఎక్కువగా పనిచేస్తోందని అంటున్నారు పరిశీలకులు. అంటే.. పనిగట్టుకుని.. జగన్ ప్రభుత్వం చింతమనేని ప్రభాకర్ గ్రాఫ్ పెంచుతోందని అంటున్నారు. మరి ఇప్పటికైనా.. జాగ్రత్త లేకపోతే.. మున్ముందు వైసీపీ పరిస్థితి ఇబ్బందుల్లో పడడం ఖాయమని చెబుతున్నారు.

# రాజకీయాల నుంచి యలమంచిలి రిటైర్మెంటేనా

విజయవాడ, సెప్టెంబర్ 3, (న్యూస్ పల్స్)విజయవాడ రాజకీయాల్లో మచ్చలేని నాయకులుగా గుర్తింపు ఉన్న కుటుంబంగా పేరున్న యలమంచిలి రవి.. ప్రస్తుతం ఫుల్ సైలెంట్ అయిపోయారు. తండ్రి యలమంచిలి నాగేశ్వరరావు వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన యలమంచిలి రవి అనతి కాలంలోనే పుంజుకున్నా.. ఆ వెంటనే వేసిన అడుగుల కారణంగా.. రాజకీయంగా చరిష్మాను కోల్పోయారనేవాదన వినిపిస్తోంది. యలమంచిలి నాగేశ్వ రరావు.. టీడీపీలో మంచి గుర్తింపు పొందారు. 1999 ఎన్నికల్లో అప్పటి కంకిపాడు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం దక్కించుకున్నారు. అంతేకాదు.. ప్రజలకు అండగా ఉండే నేతగా కూడా గుర్తింపు పొందారు. నాగేశ్వరరావు దేవినేని నెహ్రూను ఓడించి సంచలనం క్రియేట్ చేశారు.నాగేశ్వరరావు వారసుడిగా రాజకీయ అరంగేట్రం చేసిన యలమంచిలి రవి కూడా ప్రజల నేతగా.. ఎంత ఎదిగినా.. ఒదిగి ఉండే నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరిన యలమంచిలి రవి విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం దక్కించుకున్నారు. విచిత్రం ఏంటంటే ఆ ఎన్నికల్లో రవి దేవినేని నెహ్రూ, గద్దె రామ్మోహన్ లాంటి ఇద్దరు ఉద్దండులు అయిన నేతలను ఓడించారు. అయితే .. ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసిన తర్వాత.. ఆయన దూరంగా ఉన్నారు. రాష్ట్ర విభజన తర్వాత.. టీడీపీలో చేరినా ఆయన్ను పట్టించుకునే వాళ్లు లేరు.వివాద రహితుడిగా గుర్తింపు, కమ్మ సామాజిక వర్గంలో మంచి గుర్తింపు ఉన్నప్పటికీ? రాజకీయంగా యలమంచిలి రవికి కాలం కలిసి రాలేదు.ఎన్నికల సమయంలో విజయవాడ తూర్పు నియోజకవర్గం టికెట్‌ను ఆశించారు. అయితే.. చంద్రబాబు అప్పటికే.. గద్దె రామ్మోహన్‌కే మళ్లీ ఇచ్చేందుకు రెడీ అయ్యారు. పార్టీ అధికారంలోకి వస్తే.. నామినేటెడ్ పదవి ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ యలమంచిలి రవి మాత్రం.. ప్రజాసంకల్ప యాత్రలో విజయవాడకు వచ్చిన జగన్‌ను కలిసి వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎన్నికలకు ముందు వరకు ఆయనే తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. అయితే..ఇక్కడా ఆయనకు నిరాశే ఎదురైంది. తూర్పు నియోజకవర్గం టికెట్‌ను బొప్పన భవ కుమార్‌కు కేటాయించారు. ఇక, అప్పటి నుంచి యలమంచిలి అడ్రస్ లేకుండా పోయింది.పోనీ.. వచ్చే 2024 ఎన్నికల్లో అయినా.. తూర్పు టికెట్ దక్కుతుందా? అంటే.. మాజీ మంత్రి, దివంగత దేవినేని నెహ్రూ కుమారుడు, యువ నేత,, అవినాష్.. ఇప్పుడు వైసీపీతరఫున తూర్పు నియోజకవర్గంలో చక్రం తిప్పుతున్నారు. అవినాష్ జగన్‌కు సన్నిహితంగా కూడా ఉంటున్నారు. వచ్చే ఎన్నికల్లో సీటు ఎలాగూ అవినాష్‌దే డౌట్ లేదు..! అయితే ఎమ్మెల్సీనో లేదా నామినేటెడ్ పదవి అయినా ఇస్తారని యలమంచిలి రవి ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. జగన్ కనీసం జిల్లా స్థాయి నామినేటెడ్ పదవికి కూడా రవి పేరును పరిశీలించలేదు. నాడు అధికార పార్టీ టీడీపీలో ఉండి.. ఇప్పుడు మళ్లీ అధికార వైసీపీలో ఉన్నా కూడా యలమంచిలి రవిని పట్టించుకునే నేతలే లేకుండా పోయారు.

# ఎదురుతిరుగుతున్న ఆర్టీసీ నిర్ణయం



విజయవాడ, సెప్టెంబర్ 3, (న్యూస్ పల్స్)జగన్ యువ నాయకుడు. ఆయనలో దూకుడు పాలు ఎక్కువ. అందువల్ల ఆలోచించి చేశారా అన్న దాని కంటే మాట ఇచ్చాను చేశాను అన్నదే ఎక్కువగా ఉంటుంది. జగన్ అలా చేసిన ఒక పని వల్ల జనాలకు ఏమైనా మేలు జరిగిందా అన్నదే ఇక్కడ చర్చ. విషయానికి వస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో కలపాలని కొన్నేళ్ళుగా ఆ సంస్థ ఉద్యోగులు ఆందోళన చేస్తూ వచ్చారు. కానీ నాటి పాలకులు ఎవరూ వాటిని పట్టించుకోలేదు. ఉమ్మడి ఏపీలో ఎందరో సీఎం లుగా ఉన్నా కూడా ఈ డిమాండ్ ని మాత్రం పక్కనే పెట్టేవారు. ఇక చంద్రబాబు సైతం పట్టించుకోలేదు. కానీ విభజన ఏపీలో మాత్రం జగన్ ఇలా గద్దెనెక్కగానే అలా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారు.ఆర్టీసీ అన్నది సేవా సంస్థ. వారు జనాలలో ఉండాల్సిన వారు. నేరుగా ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నవారు. ఆర్టీసీ బస్సు బయట తిరిగి లాభాలు తెస్తేనే సంస్థ నడిచేది. నష్టాలు వస్తే ఆ కష్టాలు ఏంటో కార్మికులు నేరుగా రుచి చూసిన అనుభవాలు ఉన్నాయి. అందుకోసం వారు తమ బస్సులు ఎపుడూ జనాలతో కిటకిటలాడాలని, నాలుగు డబ్బులు సంస్థకు రావాలని తెగ ఆరాటపడేవారు. అలా వారు నాడు బాధ్యతగా విధులు నిర్వహించేవారు. అందువల్ల ఆర్టీసీ సంస్థ కూడా పూర్తిగా నష్టాల పాలు కాలేదు. కానీ ఇపుడు వారు సర్కార్ ఉద్యోగులు అయిపోయారు. సంస్థ నష్టాలతో పనిలేదు. దాంతో కార్మికుల తీరే మారిపోయింది అంటున్నారు జనాలు.ఇక ఇపుడు అసలైన బాధలు అన్నీ జనాలకే వచ్చి పడ్డాయి. ఇపుడు ఆర్టీసీ బస్సుల తీరు ఎలా ఉంది అంటే ఏదో చార్ట్ ప్రకారం ఇన్ని ట్రిప్పులు తిప్పామా లేదా అంటూ మొక్కుబడిగానే పోతున్నారు. బస్సులో జనాలు ఎక్కినా మానినా వారికి అసలు సంబంధం లేదు. బస్టాండ్ నుంచి రెండడుగుల దూరంలో ప్రయాణీకుడు ఉన్నా, బస్సు ఆపమన్నా కూడా ఆపకుండా ముందుకు పోతున్నారు. ఇదంతా వారికి వచ్చిన అతి భరోసాతోనే అంటున్నారు జనాలు. గతంలోనే బాగుండేది, ఆర్టీసీ వారికి తమ బతుకు భయం గుర్తుకువచ్చి జనాలను పట్టించుకునేవారు అని కూడా వాపోతున్నారు. దీని వల్ల ఖజానాకు రూపాయి రాకపోవడం వల్ల ప్రభుత్వం కూడా మరో వైపు నష్టపోతోంది అని కూడా అంటున్నారు.ఇక జగన్ అద్భుతమైన నిర్ణయమే తీసుకున్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో చేర్చుకుని వారి ఉద్యమానికి గొప్ప విజయాన్ని ఇచ్చారు. కానీ దీని మీద వామపక్షాలు అయినా సంతోషించాయా. జగన్ చేసిన పని భేష్ అని ఎపుడైనా అన్నాయా అంటే లేనే లేదు. మరో వైపు చూస్తే వామపక్షాలు తెలుగుదేశంతోనే కలసి ఉంటున్నాయి. అదే విధంగా జగన్ సర్కార్ ని ప్రతీ దానికీ తూర్పారా పడుతూనే ఉన్నాయి. పక్కనే ఉన్న పొరుగు రాష్ట్రం తెలంగాణాను తీసుకుంటే కార్మికులు ఎన్ని రోజులు ఆందోళన చేసినా కూడా ఆర్టీసీని ప్రభుత్వంలో కలపడానికి కేసీయార్ ససేమిరా అనేశారు. ఆయనకు తెలుసు. ఇలాంటి ఇబ్బందులు వస్తాయని. అందుకే ఆయన సంస్థకు వేరే విధంగా సాయం అందిస్తాం తప్ప ప్రభుత్వంలో విలీనం లేదని చెప్పేశారు. మొత్తానికి జగన్ నిర్ణయం వల్ల ఇటు ప్రభుత్వానికి, అటు పార్టీకి ఉపయోగం లేదు, మరో వైపు ప్రయాణీకులకు కూడా ఏ విధంగానూ మేలు కలగలేదు అని రెండేళ్ల ఆచరణలో తేలిపోయింది. దాంతో ప్రజలే ఇది తప్పున్నర నిర్ణయం అని విమర్శిస్తున్నారు.

# అన్నా... చెల్లెళ్ల మధ్య గ్యాప్...

కడప, సెప్టెంబర్ 3, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో కుటుంబమంతా కలసి ఒకే బాటలో నడవడమనేది చాలా అరుదుగా కన్పిస్తుంది. ఇందిరాగాంధీ కుటుంబం నుంచి తీసుకుంటే రాజకీయాలు కుటుంబంలో విభేదాలు సృష్టిస్తాయనే చెప్పాలి. అధికారంలో రాకముందు వరకూ కలసి ఉన్న వారు పవర్ చేతికి చిక్కగానే చీలిక ఏర్పడటం సర్వసాధారణమయింది. ఇందులో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మినహాయింపు కాదు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి జీవించి ఉన్నంత కాలం కుటుంబమంతా ఒకతాటిపై నడిచింది.ఆయన మరణం తర్వాత కూడా జగన్ జైలు పాలయినప్పుడు, కొత్త పార్టీ పెట్టినప్పుడు, ఎన్నికల బరిలోకి దిగినప్పుడు అంతా ఒక్కటై నిలిచారు. జగన్ కు అండగా నిలిచారు. కానీ జగన్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలోనే ఆ కుటుంబంలో పరిస్థితులు మారిపోయాయి. అధికారం కుటుంబ సభ్యుల మధ్య చిచ్చు పెట్టిందనే చెప్పాలి. జగన్, వైఎస్ షర్మిల మధ్య ఏర్పడిన బేధాభిప్రాయాల వల్లనే తెలంగాణలో కొత్త పార్టీ పెట్టడానికి కారణంగా చెప్పాలి.ఇక అన్నా చెల్లెల్లు గతంలో అందరికీ ఆదర్శంగా నిలిచే వారు. అన్నమాట జవదాటని చెల్లెలుగా షర్మిల, చెల్లి తన ఆరో ప్రాణంగా జగన్ భావించే వారు. కానీ ఇప్పుడు ఒకరి మొహాలు ఒకరు చూసుకునే పరిస్థితి కన్పించలేదు.



గతంలో వైఎస్ జయంతి సందర్భంగా ఇడుపులపాయలో ఇద్దరూ వేర్వేరుగా వచ్చి నివాళులర్పించి వెళ్లిపోయారు. ప్రతి ఏటా రాఖీ సందర్భంగా కలిసే అన్నా చెల్లెల్లు ఈసారి పండగకు దూరంగా ఉన్నారు. విషెస్ కే పరిమితమయ్యారు.ఇప్పుడు తాజాగా వైఎస్ వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయకు ఇద్దరు ఒకేరోజు వచ్చినా ఒకరినొకరు పలకరించుకోలేదు. కనీసం ఒకరినొకరు చూసుకునేందుకు కూడా ఇష్టపడలేదు. జగన్, షర్మిల పక్కనే కూర్చుని నివాళు లర్పించి వెళ్లిపోయారు. రెండు రాష్ట్రాల్లో వైఎస్సార్ కు అభిమానులున్నారు. వారందరూ ఈ ఘటన చూసి ఆందోళన చెందుతున్నారు. వైఎస్సార్ ఫ్యామిలీలో ఈ చీలిక ఎందుకు వచ్చిందా? అని మదన పడుతున్నారు.

# మళ్లీ రాజధాని లొల్లి

విజయవాడ, సెప్టెంబర్ 3, (న్యూస్ పల్స్)బాగా చదువుకొన్నాక కీకరకాయ అని వెనకటికి ఒకడు అన్నాడని చెబుతారు. అలా తెలివి అతి తెలివి అన్నీ కలసి ఏపీ రాజధానిని చిరిగి చేట చేస్తున్నాయా? అనిపించకమానదు. అసలు ఏ రాష్ట్రానికి లేనన్ని వివాదాలు ఒక్క ఏపీకే ఉండడం శాపమైతే ఇక రాజధాని విషయంలో ఎవరికి తోచిన విధంగా వారు చెబుతున్న భాష్యాలు కూడా పరిస్థితిని మరింతగా గందరగోళంలోకి నెడుతున్నాయి. ఇంతకీ ఏపీకి రాజధాని ఏదీ అంటే ఎవరూ చెప్పలేని స్థితి. ఆఖరుకి కేంద్రం సైతం ఒకసారి వైజాగ్ అని మరోసారి అమరావతి అంటూ తెగ తడుముకుంటోంది. దీనికంతటికీ కారణం రాజధాని పేరిట సాగుతున్న రాజకీయమే అని చెప్పాల్సిందే.ముఖ్యమంత్రి ఎక్కడ ఉంటే అదే రాజధాని అంటూ ఇటీవల వైసీపీ మంత్రి మేకపాటి గౌతం రెడ్డి చెప్పుకొచ్చారు. రాజధాని అంటూ రాజ్యాంగంలో ప్రత్యేకంగా నిర్వచించి లేదని కూడా ఆయన అంటున్నారు. అందువల్ల సీఎం పులివెందులలో ఉన్నా, విశాఖలో ఉన్నా, విజయవాడలో ఉన్నా అదే రాజధాని అంటూ మేకపాటి మూడు రాజధానుల గురించి సమర్థిస్తూ మాట్లాడే ప్రయత్నం చేశారు. అక్కడే ఆయన నెటిజన్లకు అడ్డంగా దొరికిపోయారు. జగన్ విహారానికి సిమ్లా వెళ్లారు. అది కూడా మన రాజధాని అని రాసేసుకోవాలా మంత్రి గారూ అంటూ సోషల్ మీడియాలో తెగ ట్రోలింగ్ మొదలైపోయింది. ఇక సీఎం గారూ మా వూరికి రండి, మా గ్రామాన్ని కూడా రాజధాని చేసి పొండి అంటూ నెటిజన్లు షాకింగ్ కామెంట్స్ పెడుతున్నారు అంటే దానికి కారణం ఇలాంటి ప్రకటనలే అనుకోవాలిగా.మూడు రాజధానుల మీద ముచ్చట ఉంటే ఉండొచ్చు. కానీ అది సీరియస్ మ్యాటర్. దేశం ఇంతకు ముందు వరకూ ఎరగని ప్రయోగం. దిగితే కానీ దాని లోతుపాతులు, సాధ్యాసాధ్యాలు ఎవరికీ తెలియవు. అలాంటి విషయంలో వైసీపీ పెద్దలు ఆచీ తూచీ మాట్లాడాలి. నిన్నటికి నిన్న మంత్రి బొత్స సత్యనారాయణ విశాఖే మన రాజధాని, అమరావతి రైతులతో చర్చలు జరపాల్సిన పని లేదు అంటారు. ఇపుడు గౌతం రెడ్డి అయితే ఏపీకి ఫలానా రాజధాని అని ఉండదని కామెడీ డైలాగులు చెబుతున్నారు. నిజానికి ఇంతటి సీరియస్ మ్యాటర్ ని ఎలా డీల్ చేయాలో తెలియకపోతే మంత్రులు మౌనం వహించడం మంచిది కానీ ఏదో చెప్పాలనుకుని మరింతగా జనాలలో నెగిటివిటీని తెచ్చుకోవడం ఎందుకు అన్నదే అందరి మాట.ఏపీకి రాజధాని సరైనది గత డెబ్బై ఏళ్ళుగా లేకపోవడం అన్నది బాధాకరం. ఒక విధంగా చూస్తే ప్రజలలో అది సెంటిమెంట్ గా కూడా ఉంది. అమరావతి రాజధాని అన్నాక రాయలసీమ, ఉత్తరాంధ్రా ప్రజానీకంలో ఆవేశం, బాధా కలిగాయి అన్నది వాస్తవం, కానీ వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒకటి కాదు మూడు అంటూ ఉన్న ఉన్న నాలికే లేకుండా చేయడం పట్ల మాత్రం వ్యతిరేకత మూట కట్టుకునే లాగే ఉంది అంటున్నారు. ఈ పరిస్థితుల్లో కోర్టు తీర్పు వచ్చేంతవరకూ సంయమనాన్ని పాటించాల్సిన వైసీపీ మంత్రులు పూటకో మాట మాట్లాడితే అంతిమంగా అది జగన్ సర్కార్ కే చేటు తెస్తుంది. చివరికి విసిగిన జనం జై అమరావతి అన్నా అంటారు. మొత్తానికి రాజధాని అన్నది సున్నితమైన అంశం, భావోద్వేగాలతో కూడుకున్న వ్యవహారం. దీన్ని లైట్ గా తీసుకుంటే మాత్రం ఏపీ జనాలే లైట్ చేసి పారేస్తారు అన్నదే వైసీపీ శ్రేయోభిలాషుల మాట.

# ఎంపీతో గ్యాప్ పెరుగుతోందా

గుంటూరు, సెప్టెంబర్ 3, (న్యూస్ పల్స్)వును? వైసీపీలో కీలక యువ నేత, ఎంపీగా ఉన్న నాయకుడికి.. ముఖ్యమంత్రి జగన్‌కు మధ్య గ్యాప్ పెరిగిందా ? జగన్ కనీసం ఆయనకు అప్పాయింట్‌మెంటు కూడా ఇవ్వడంలేదా ? అసలు ఆ ఎంపీ చెప్పాలనుకున్నా ఇప్పటికే చెప్పిన ఏ విషయాన్నీ.. జగన్ పట్టించుకోవడం లేదా? అంటే.. ఔననే అంటున్నారు పరిశీలకులు. ఆ ఎంపీనే గుంటూరు జిల్లా నరసారావుపేట నియోజకవర్గం నుంచి విజయం దక్కించుకున్న లావు శ్రీకృష్ణదేవరాయులు. వాస్తవానికి గత ఎన్నికల ముందు.. జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా వ్యవహరించారు లావు శ్రీకృష్ణదేవరాయులు. దీంతో పార్టీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో సీఎంకు, లావుకు మధ్య సన్నిహిత సబంధాలు బాగానే నడిచాయి.అయితే.. గత ఏడాది కాలంగా లావు శ్రీకృష్ణదేవరాయులుకు, సీఎంకు మధ్య గ్యాప్ పెరిగిందని అంటున్నారు. దీనికి ప్రధానంగా.. ఎంపీపై జగన్‌కు కొందరు ఫిర్యాదులు మోశారని చెబుతున్నారు. రాజధాని అమరావతి విషయంలో వైసీపీ ఒక స్టాండ్ తీసుకుంది. ఏపీకి మూడు రాజధానులు ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో అమరావతిని దూరం పెట్టింది. దీంతో ఇక్కడి రైతులు.. ఆందోళన బాటపట్టారు. అంతేకాదు ప్రభుత్వంపై కోర్టుల్లోనూ కేసులు వేశారు. సీఎం జగన్‌ను తీవ్రంగా విమర్శించారు. దీంతో వైసీపీ నేతలు ఎవరూ కూడా రాజధానిపై మాట్లాడకుండా.. రైతులు ఏర్పాటు చేసుకున్న శిబిరాల వైపు వెళ్లకుండా జాగ్రత్తలు పడ్డారు.ఇంత హడావుడి జరుగుతున్న సమయంలో కొన్నాళ్ల కిందట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు అమరావతి ప్రాంతాని కి వెళ్లి.. దాదాపు గంటసేపు ఇక్కడి రైతులతో ముచ్చట్లు పెట్టుకున్నారు. వారిని అనునయించారు. ఆయన ఏం మాట్లాడారనేది పక్కన పెడితే.. అసలు పార్టీ లైన్‌కు వ్యతిరేకంగా.. ఎంపీ..అమరావతి రైతులను కలుసుకోవడమే.. పెద్ద నేరంగా.. ఎంపీపై కొన్ని ఫిర్యాదులు సీఎంకు చేరాయి. రాజధాని అమరావతికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు సానుకూలమని.. ఆయన కమ్మ సామాజిక వర్గానికి చెంది ఉండడమే రీజనని వైసీపీ సీనియర్ల మధ్య కూడా కొన్నాళ్లు చర్చసాగింది. దీంతో ఈ పరిణామం.. ఎంపీకి, సీఎంకి మధ్య గ్యాప్ పెంచిందని అంటున్నారు. ఇక, ఆ తర్వాత.. ఎంపీ ఏం చెప్పినా.. జగన్ పట్టించుకోవడం మానేశారని అంటున్నారు.ఇక, చిలకలూరిపేట ఎమ్మెల్యే విడదల రజనీ బంధువర్గం.. కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా.. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు వర్గంపై భౌతిక దాడికి దిగింది. ఏకంగా ఎంపీ ప్రయాణిస్తున్న కారునే అడ్డగించి వెనక్కి పంపారు. ఈ పరిణామంపై ఎంపీ.. సీఎం సలహాదారు సజ్జలకు ఫిర్యాదు కూడా చేశారు. అయితే.. ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఇక, గురజాల ఎమ్మెల్యేకాసు మహేష్‌రెడ్డితోనూ లావు శ్రీకృష్ణదేవరాయులుకు పొసగడం లేదు. అలాగే వినుకొండ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుతో పాటు చిలకలూరిపేట ఎమ్మెల్యే రజనీతోనూ లావుకు తీవ్రమైన గ్యాప్ ఉంది.ఆయా సమస్యల పరిష్కారం కోసం లావు శ్రీకృష్ణదేవరాయులు ప్రయత్నాలు చేస్తున్నా.. సీఎం జగన్ మాత్రం అప్పాయిం ట్‌మెంట్ ఇచ్చేందుకు సుముఖంగా లేరు. ఇవన్నీ ఇలా.. ఉంటే.. లావు శ్రీకృష్ణదేవరాయులు సీఈవోగా ఉన్న విజ్ఞాన్ విద్యాసంస్థలకు సంబంధించి.. ప్రభుత్వాన్ని నిరంతరం తిట్టిపోసే.. ఓ పత్రికకు భారీ ఎత్తున యాడ్ ఇవ్వడం.. కూడా జగన్ ఆగ్రహానికి కారణమై ఉంటుందని అంటున్నారు పరిశీలకులు. మరి ఈ గ్యాప్ ఇలానే కొనసాగుతుందో.. సమసిపోతుందో చూడాలి.



# దాసన్న అంతటితో ఆగుతారా...

శ్రీకాకుళం, సెప్టెంబర్ 3, (న్యూస్ పల్స్)శ్రీకాకుళం జిల్లాలో ధర్మాన కుటుంబానికి రాజకీయ ప్రాధాన్యత ఉంది. అయితే దశాబ్దాల పాటు తమ్ముడు ధర్మాన ప్రసాదరావు రాజకీయాల్లో ఉంటే అన్న ధర్మాన కృష్ణ దాస్ మాత్రం తెరచాటునే ఉండిపోయారు. ఆయన తమ్ముడి విజయానికి పని చేస్తూ వచ్చారు. ఇక 2004 ఎన్నికల్లో వైఎస్సార్ కృష్ణ దాస్ ని రాజకీయాల్లోకి రమ్మని ఆహ్వానించడంతో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి తొలిసారి నరసన్నపేట నుంచి గెలిచారు. ఇక ఆయన తరువాత జగన్ వైపు కూడా వచ్చి వైసీపీ ఆవిర్భావం వేళ కీలకమైన పాత్ర పోషించారు. జగన్ కూడా ధర్మాన కృష్ణ దాస్ సేవలను మెచ్చి ఏకంగా ఉప ముఖ్యమంత్రి పదవే కట్టబెట్టారు. తాజాగా జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ధర్మాన కృష్ణ దాస్ జగన్ ప్రభుత్వం మీద కాస్తా విమర్శనాత్మకమైన ధోరణిలో మాట్లాడారు. క్రీడలకు ప్రభుత్వం పెద్దగా ఖర్చు చేయడంలేదని విపక్ష సభ్యుని మాదిరిగా ఆయన మాట్లాడడం విడ్డూరమే. నిజానికి ధర్మాన కృష్ణ దాస్ చాలా సంయమనంతో వ్యవహరిస్తారు. కానీ మీడియా ముందే ఎవరేమనుకున్నా అనుకోనీయండి అంటూ అంటూ తన మనసులో భావాలను కుండబద్ధలు కొట్టారు. క్రీడల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని దాసన్న గట్టిగానే మాట్లాడారు. క్రీడలకు పెద్ద ఎత్తున ఖర్చు చేస్తే వైద్యానికి ఖర్చు చేసే బాధ తప్పుతుంది అని కూడా అన్నారు. నిజానికి ధర్మాన కృష్ణ దాస్ చేసిన సూచనలు మంచివే. ఆయన సీనియర్ నేత. జగన్ కి అత్యంత సన్నిహితుడు. నేరుగా ఇదే మాట జగన్ కి చెబితే పోయేదానికి జనంలో మాట్లాడడం ఏంటి అన్నదే చర్చగా ఉందిధర్మాన కృష్ణ దాస్ కి జగన్ పెద్ద పీట వేశారు. రెవిన్యూ మంత్రి వంటి కీలకమైన శాఖలు ఇచ్చారు. ఉపముఖ్యమంత్రి అంటే ఉత్తరాంధ్రాలో ఆయనకే తొలి అవకాశం దక్కినట్లుగా చూడాలి. అలాంటిది దాసన్నలో ఎందుకీ అసంతృప్తి వచ్చింది అన్నదే అందరి మాటగా ఉంది. ఆయనకు తన పదవి ఉండదని తెలిసిపోయిందా అన్న చర్చ కూడా వస్తోంది. జగన్ ఏం చేయమన్నా క్షణాల్లో చేసే దాసన్న మంత్రి పదవి వదులుకోమన్నా నో అని చెప్పరనే అంతా అంటారు. కానీ కారణాలు దాని కంటే వేరే ఉన్నాయని అంటున్నారు. జిల్లాల్లోనూ సొంత పార్టీలోనూ మరో వర్గానికి జగన్ ప్రాధాన్యత ఇవ్వబోతున్నారు అన్నదే ధర్మాన కృష్ణ దాస్ ఆవేదన అని కూడా చెబుతున్నారు. ఇక ధర్మాన కృష్ణ దాస్ మరో మాట కూడా అంటున్నారు. తనకు క్రీడాకారుడు అన్న హోదా కంటే మరేదీ ఎక్కువ కాదు అని. అంటే రేపటి రోజున మాజీ అయినా కూడా తనకు బే ఫికర్ అన్నట్లుగానే ఆయన మాటలు ఉన్నాయనే చెబుతున్నారు. ఇక ఈ మధ్య కాలంలో శ్రీకాకుళం జిల్లా రాజకీయాల్లో ధర్మాన కృష్ణ దాస్ కి తెలియకుండా అనేకమైనవి జరిగిపోతున్నాయి. దాంతో తాను ఉప ముఖ్యమంత్రిగా ఉండి ఏం లాభమని కూడా దాసన్న మధనపడిన సందర్భాలు ఉన్నాయి. మొత్తానికి జగన్ ని నేరుగా ఏమీ అనకుండా ప్రజలకు అవసరమైన ఒక అంశం మీదనే తెలివిగా దాసన్న మాట్లాడి ప్రభుత్వం తప్పుని ఎత్తి చూపారు. మరి ఇది ఆరంభమా లేక ఇక్కడితో ఆయన ఆగుతారా అన్నది చూడాలి. ఏది ఏమైనా సీనియర్ నేతగా ఉన్న దాసన్న మాజీ అయితే ఆయన రాజకీయం ఎలా ఉంటుందో అన్నది మాత్రం వైసీపీలో హాట్ హాట్ డిస్కషన్ గానే ఉంది.

# పెన్షన్ల తొలగింపు దారుణం

కోసిగి ఏపీలో ప్రస్తుతం పెన్షన్ల తొలగింపు దారుణంగా వుంది అని మంత్రాలయం నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కరెడ్డి సోదరుడు టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి కోసిగి లో స్థానిక యం పి డి ఓ ఆఫీసు వద్ద నిరసన వ్యక్తం చేసి యం పి డి ఓ కి వినతి పత్రం అందచేసిరు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పింఛన్ల పైనే జీవనం కొనసాగిస్తున్న ఎందరో వృద్ధులు వితంతువులు వంటి వారి పింఛన్లను నేడు వైసీపీ ప్రభుత్వ అసమర్థ పాలన లో తొలగింపు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. మాట తప్పను మడమ తిప్పను అని సినిమా డైలాగ్ లతో ఊదరగొట్టిన జగన్ నేడు చేస్తున్నది ఏంటని ప్రశ్నించారు. పెన్షన్లకు అన్ని అర్హతలూ ఉన్నప్పటికీ ఏదో ఒక సాకుతో పెన్షన్లను తొలగిస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చి రాష్ట్రాన్ని దివాలా తీసేలా చేయడం వల్లనే రాష్ట్రంలోఆదాయం తో పాటు అభివృద్ధి కూడా సర్వ నాశనం అయిందని దీని వల్లనే పింఛన్లు సైతం ఇవ్వ లేకపోవడంతో పరోక్షంగా వాళ్లు ఏదో ఒక సాకుతో

### టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి

పెన్షన్లు తొలగిస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో పెన్షన్లను తొలగించారని అన్నారు. అధికారంలో రాగానే 3000 పెన్షన్ చేస్తారన్న జగన్ ప్రభుత్వం నేడు ప్రస్తుతం ఉన్న పెన్షన్లను కూడా ఇవ్వలేక వాటిని సైతం తొలగిస్తున్నారని అన్నారు. వెంటనే తొలగించిన పెన్షన్ లతోపాటు అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా పార్లమెంటు ఉపాధ్యక్షులు ముత్తు రెడ్డి రైతు సంఘం కార్యదర్శి నాడిగేని అయ్యన్న సీనియర్ నాయకులు పల్లెపాడు రామిరెడ్డి తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి జ్ఞానేష్ చితలగేని నర్సిరెడ్డి సుగూరు నాగేష్ చిలుక తాయన్న చిన్న భూంపల్లి మాజీ సర్పంచ్ నరసింహులు లక్ష్మీకాంత్ గోపాల్ నాడిగేని వీరారెడ్డి తాయన్న పంపాపతి రంగన్న డీలర్ నరసన్న హోటల్ విరేష్ బుజ్జి స్వామి ప్రభాకర్ రెడ్డి రణ తిక్కన్న కప్పయ్య యస్ సి సెల్ జిల్లా కార్యదర్శి సల్మాన్ రాజు బెళగల్ సర్పంచ్ రామయ్య బసవలింగప్ప చాకలి శివ శిను వీరారెడ్డి హనుమంతు రెడ్డి తెలుగు యువత దుద్ది నాగేష్ వీరారెడ్డి మారేష్ రాజు మహదేవ హనుమంతు గుండేష్ ఉసేని ప్రకాష్ ఆనంద్ రాజు అన్ని గ్రామాలు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఆదానీ గ్రూపుకు 130 ఎకరాలు



విశాఖపట్టణం, సెప్టెంబర్ 3, (న్యూస్ పల్స్)నీ గ్రూపునకు విశాఖలోని మధురవాడ ఐటి సెజ్ హిల్ నంబర్.4లో 130 ఎకరాలను డేటా సెంటర్, బిజినెస్ పార్కు కోసం కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. దీనిని అమలు చేసే పనిలో ఎపిఐఐసి అధికారులు ఉన్నారు. భూమిని అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నామంటూ 'ప్రజాశక్తి'కి ఎపిఐఐసి జోనల్ మేనేజర్ సి.యతిరాజ్ మంగళవారం చెప్పారు. అదానీ డేటా సెంటర్ ఇప్పటికే ఎకరాకు రూ.కోటి చొప్పున ప్రభుత్వానికి రూ.130 కోట్లు జమ చేసినట్లు ఆయన తెలిపారు. రూ.14,630 కోట్ల పెట్టుబడులు రానున్నామని, 24 వేల మందికి ఉద్యోగాలను కల్పించనున్నామని గత నవంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి అదానీ సెంటర్ నివేదించింది. ఈ నేపథ్యంలో మధురవాడకు అతి సమీపంలోని రుషికొండ ఐటి సెజ్ (స్పెషల్ ఎకనమిక్ జోన్) శ్రీరామ్ పనోరమ హిల్స్ వద్ద భూమిని కేటాయించేందుకు రంగం సిద్ధమైంది. ఇది ఎపి టూరిజం డిపార్టుమెంట్‌కు చెందిన భూమని తెలుస్తోంది. ఈ భూముని అదానీ డేటా సెంటర్‌కు అప్పగించే దిశగా ఫైళ్లు విశాఖలో చకాచకా కదులుతున్నాయి. 130 ఎకరాలుగానూ 82 ఎకరాలను డేటా పార్కు కోసం వినియోగించనున్నారు. దీంట్లోనే 20 మెగావాట్ల సోలార్ ప్లాంట్, 28 ఎకరాలు ఐటి బిజినెస్ పార్కు, 11 ఎకరాలు స్కిల్ డవలప్‌మెంట్ యూనివర్సిటీ, తొమ్మిది ఎకరాలు రిక్రియేషన్ కోసం కేటాయించనున్నారు. రుషికొండ ఐటి సెజ్ కోసం రైతుల నుంచి భూములను కారు చౌకగా గతంలో సేకరించారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఎకరా భూమి విలువ రూ.20 కోట్లు ఉంది. ఈ లెక్కన అదానీ డేటా సెంటర్‌కు ఇస్తోన్న 130 ఎకరాల భూమి విలువ రూ.2,600 కోట్లు ఉంటుంది. సెజ్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఈ భూమిని రూ.130 కోట్లకే కట్టబెడుతోంది. అదానీ డేటా సెంటర్‌కు చంద్రబాబు హయాంలో సుమారు 1,300 ఎకరాలు కేటాయించారు. రూ.70 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని, రెండు లక్షలకుపైగా ఉద్యోగాల కల్పన జరుగుతుందని అప్పట్లో పేర్కొన్నారు. కాపులుప్పాడలో ఎపిఐఐసి ద్వారా భూమిని అప్పటి టిడిపి ప్రభుత్వం 2018లో ఇచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు చంద్రబాబు ఈ డేటా సెంటర్‌కు హుటాహుటిన అనుమతులు ఇచ్చేస్తూ కార్యక్రమాన్ని హడావుడిగా ప్రారంభించారనే విమర్శలు ఉన్నాయి. 2019 సాధారణ ఎన్నికలకు ముందు ఈ భారీ ప్రాజెక్టుకు చంద్రబాబు శంకుస్థాపన కూడా చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 2020లో ఈ కేటాయింపును రద్దు చేసింది. ఇదే ప్రభుత్వం ఇప్పుడు అదానీ డేటా సెంటర్‌కు భూమిని కారు చౌకగా కేటాయించడం గమనార్హం.

# లోకసంక్షేమం కోసం " షోడశదిన బాలకాండ పారాయణ దీక్ష "

### - వసంత మండపంలో 16 రోజుల పాటు పారాయణం

తిరుమల,మా ప్రతినిధి, సెప్టెంబర్03,లోక సంక్షేమం కోసం, కరోనా మూడవ వేవ్ ప్రత్యేకించి చిన్న పిల్లలపైన ప్రభావం ఎక్కువగా చూపించే అవకాశం ఉన్నదని ప్రభుత్వాలు, వైద్య సంస్థలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో, చిన్నారులు అందరూ ఆరోగ్యంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థిస్తూ తలపెట్టిన షోడశదిన బాలకాండ పారాయణ దీక్ష తిరుమలలోని వసంత మండపంలో శుక్రవారం ఉదయం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ఈ దీక్ష 18వ తేదీ వరకు జరుగనుంది. బాలకాండలో " బభౌరామఃసంప్రహృష్టఃసర్వదైవతైః " అనే 16 అక్షరాల వాక్యం విశిష్టమైనది. ఇందులో మొదటి రోజు బ అనే అక్షరానికి ఉన్న బీజాక్షరాల ప్రకారం బాలకాండలోని మొదటి సర్గలో 100, రెండో సర్గలో 43 కలిపి మొత్తం 143 శ్లోకాలను పారాయణం చేశారు. ఇందులో భాగంగా మొదట సంకల్పంతో ప్రారంభించి శ్రీరామ ప్రార్థన, శ్రీ ఆంజనేయ ప్రార్థన, శ్రీ వాల్మీకి ప్రార్థన చేశారు. ఆ తరువాత 16 మంది ఉపాసకులు శ్లోక పారాయణం చేశారు. శనివారంనాడు మూడో సర్గ నుండి ఏడవ సర్గ వరకు మొత్తం 142 శ్లోకాలను పారాయణం చేయనున్నారు. కాగా బాలకాండలోని మొత్తం 77 సర్గల్లో 2,232 శ్లోకాలు ఉన్నాయి. ధర్మగిరి వేద పాఠశాల ప్రిన్సిపాల్ ఆచార్య కుప్పా శివసుబ్రహ్మణ్య అవధాని పర్యవేక్షణలో ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం శాస్త్ర పండితులు శ్రీ మారుతి పారాయణ కార్యక్రమం నిర్వహించారు. వసంత మండపంలో శ్లోక పారాయణంతో పాటు ధర్మగిరి వేద పాఠశాలలో మరో 16 మంది ఉపాసకులు 16 రోజుల పాటు శ్రీ సీతా లక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీ రామచంద్రమూర్తి మూల మంత్ర జప-తర్పణ- హోమ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల కోసం ప్రతిరోజూ ఉదయం 8.30 గంటల నుండి ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

# గన్నవరంలో భారీ అగ్నిప్రమాదం

గన్నవరం సెప్టెంబర్ 3, (న్యూస్ పల్స్)కృష్ణాజిల్లా గన్నవరంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. విజయ పాలిమిర్స్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే ఫ్యాక్టరీ మొత్తం వ్యాపించాయి. పెద్ద ఎత్తున ఎగిసిపడిన మంటలు చూసి స్థానికులు భయంతో పరుగులు తీశారు. ఆ ప్రాంతమంతా నల్లని దట్టమైన పొగ అలుముకుంది. దీంతో భయాందోళన చెందుతున్నారు స్థానికులు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం తెంపల్లి రైల్వే గేట్ సమీపంలో శ్రీవిద్య పాలిమర్స్ కంపెనీలో శుక్రవారం తెల్లవారు జామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఉదయం 5 గంటలకు కంపెనీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పేందుకు యత్నిస్తున్నప్పటికీ అదుపులోకి రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో మరిన్ని అగ్నిమాపకం వాహనాలతో ఫైర్ సిబ్బంది శ్రమిస్తున్నారు. కాగా, ప్రస్తుతం ఈ కంపెనీలో సూపర్ సంచులు తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ ప్రమాదానికి సంబంధించి సమాచారం అందుకున్న ఆత్కూరు పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని పరిస్థితి సమీక్షిస్తున్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అయితే, ఈ ప్రమాదంలో భారీగానే ఆస్థి నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# సి పీ ఎస్ విధానాన్ని రద్దు చేయాలి

### టి ఎన్ టి యు సి

విశాఖపట్నం సెప్టెంబర్ 3, (న్యూస్ పల్స్)డుంబ్రిగుడ మండల కేంద్రంలోని ఉద్యోగా ఉపాధ్యాయులకు కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని అరకు పార్లమెంట్ టి ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి ఏం స్వామి డిమాండ్ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన వెంటనే కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ ని అమలు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు గడిచినా దానిపై ఎటువంటి స్పందన గాని చర్యలుగానే తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు గత్యంతరం లేని ఈ పరిస్థితులలో ఉద్యోగులు ఉపాధ్యాయులు నిరసన ర్యాలీలు వంటి ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నారు లేనియెడల వెంటనే ప్రభుత్వం స్పందించి సి పీ ఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు లేనియెడల భవిష్యత్తులో ఉద్యోగ ఉపాధ్యాయులు చేసే పోరాటంలో టి ఎన్ టి యు సి పూర్తి మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు

# పక్కదారి పడుతున్న ఇండియన్ గ్యాస్ బండలు

### విచ్చల విడిగా బ్లాక్ మార్కెట్ దందా

### గ్యాస్ బండలు డోర్ డెలివరీ చేయాలి

### సిపిఐ మండల కార్యదర్శి కూడ రాధాకృష్ణ డిమాండ్

విశాఖపట్నం సెప్టెంబర్ 3, (న్యూస్ పల్స్) విశాఖ ఆదివాసి ప్రాంతమైన పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో నడుస్తున్న ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలో కాలం చెల్లిన పైపుల అక్రమాలపై అధికారులు కనీసం విచారణ చేపట్టిన పాపాన పోలేదని సిపిఐ పార్టీ పాడేరు మండల కార్యదర్శి కూడ రాధాకృ?ష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంచె చేను మేస్తే.... కాపలా కాసేది ఎవరు అనే విదంగా అధికారుల తీరు ఉందని అన్నారు. ఆగస్టు నెలలో మొత్తం గ్యాస్ బండ మార్పిడి కోసం వెళ్ళిన లబ్ధిదారులకు 150 రూపాయలు చెల్లించకపోతే మీ గ్యాస్ బండ మార్పిడి జరగదని గ్యాస్ ఏజెన్సీ అధికారులు చెప్పడంతో గత్యంతరం లేక కాలంచెల్లిన పైపులు తీసుకోవలసిన పరిస్థితి వచ్చిందని. అయితే రోజుకి 1000 నుండి 1500 వరకు లబ్ధిదారులు గ్యాస్ మార్పిడి కోసం గ్యాస్ గోడౌన్ లో బండలు మార్పిడి చేసుకోవడం జరుగుతుందని. ఒక్కరోజు వెయ్యి మంది గ్యాస్ బండలు మార్పిడి జరిగిన ఒక లక్షా 50 వేల రూపాయలు లబ్ధిదారుల నుండి అడ్డగోలుగా వసూలు చేశారని మండిపడ్డారు. తక్షణమే లబ్ధిదారులకు తిరిగి డబ్బులు చెల్లించాలని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా పాడేరు పట్టణంలో గ్యాస్ బండలు డోర్ డెలివరీ చేయాల్సి ఉన్నప్పటికీ డోర్ డెలివరీ చేయడం లేదని తక్షణమే పాడేరు పట్టణ పరిధిలో గ్యాస్ బండలు డోర్ డెలివరీ చేయాలని, బ్లాక్ మార్కెట్లో విచ్చలవిడిగా గ్యాస్ బండలు తరలి పోతున్నాయని, పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల మండలాలకు ఏకైక ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ఒక్కటే ఉండటంతో రైతుల పనులు మానుకొని 20 ,30 కిలోమీటర్లు దూరం నుంచి వచ్చే లోపే బ్లాక్ మార్కెట్లో తరలిపోతుందన్నారు. లబ్దిదారులు మాత్రం నిరాశతో గ్యాస్ గోడౌన్ దగ్గర పడిగాపులు కాయాల్సి వస్తుందని అందులో గ్యాస్ ఏజెన్సీ అధికారులు రోజుకో కొత్త రూల్స్ తీసుకురావడం గ్యాస్ లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. గ్రామాలలో కూడా గ్యాస్ బండలు డోర్ డెలివరీ చేయాలని, గ్యాస్ పైపుల అక్రమాలపై నిజాలు బయటపెట్టాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ పాడేరు మండలం నాయకులు అమర్ ,మున్నా పాల్గొన్నారు.

# శ్రీ కపిలేశ్వరాలయంలో లక్ష కుంకుమార్చన

తిరుపతి,మా ప్రతినిధి,సెప్టెంబర్ 03, తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో శ్రావణమాసంలో చివరి శుక్రవారం శ్రీ కామాక్షి అమ్మవారికి శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన నిర్వహించారు. కోవిడ్-19 నిబంధనల మేరకు ఆలయంలో ఏకాంతంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ఆలయంలోని మండపంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, శ్రీ సరస్వతి అమ్మవారు, శ్రీ కామాక్షి అమ్మవార్లను కొలువుదీర్చి కుంకుమార్చన చేపట్టారు. ముందుగా కలశస్థాపన, గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశారాధన చేశారు. ఈ సందర్భంగా లక్ష సార్లు కుంకుమతో అమ్మవారికి అర్చన చేశారు.

# దంపతుల దారుణ హత్య

కడప సెప్టెంబర్ 3, (న్యూస్ పల్స్)కడప జిల్లా బ్రహ్మంగారి మఠం మండల కేంద్రంలోని కొత్త బసాపురం గ్రామంలో తొరి వేముల నాగయ్య, నాగమ్మ దంపతులు దారుణ హత్యకు గురయ్యారు. వారిద్దరూ నిద్రిస్తుండగా దారుణంగా ఈ తెల్లవారుజామున హత్య చేశారు. ఈ హత్యకు గురైననాగమ్మ కుస్వయానా చెల్లెలు కొడుకు వీరయ్య ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసు వర్గాల సమాచారం. హంతకుడు వీరయ్య నాగమ్మ కు స్వయానా చెల్లెలు కొడుకు. వీరి స్వగ్రామం చాపాడు మండలం నాగులపల్లె. పెద్దమ్మ, పెద్దనాయన్నను హత్యచేసిన ప్రదేశంలోనే హంతుకుడు వీరయ్య ఉండటంతో జనం ఆగ్రహించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఓ ఇంట్లో దాక్కున్నవీరయ్యను అదుపులోకితీసుకుని విచారిస్తున్నారు.. మానసికపరిస్థితి సరిగా లేని కారణంగా ఈ దారుణంకు ఒడిగట్టారనే ప్రచారం ఉంది. దంపతులు నాగయ్య, నాగమ్మ హత్యలపైకేసు నమోదు చేసి రూరల్ సీఐ కొండారెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు విచారణ చేపట్టారు.. దంపతులిద్దరు హత్యకు గురికావడం బి.మఠంలో పెద్ద సంచలనం రెకెత్తించింది.

# వివిధ రైల్వే ప్రాజెక్టులకు భూమి సేకరించి అప్పగించేందుకు మూడు నెలలు గడువు కోరిన సిఎస్

విజయవాడ, సెప్టెంబర్ 3 రాష్ట్రంలో విజయనగరం- టిట్లాఘర్ 3వ రైల్వే లైను ప్రాజెక్టు,నడికుడి-శ్రీకాళహస్తి నూతన రైలు మార్గం తోపాటు కడప-బెంగుళూర్ నూతన రైలు మార్గాలకు సంబంధించి మిగతా భూమి సమీకరించి అప్పగించేందుకు గాను మరో మూడు మాసాలు అనగా డిసెంబరు నెలాఖరు వరకు గడువు ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యా నాథ్ దాస్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రగతి ప్రాజెక్టులు రైల్వే, బొగ్గు,ఇంధనం,స్టీల్ ప్రాజెక్టులకు చెందిన 13 పెండింగు అంశాలపై ఆంధ్రప్రదేశ్,ఒడిస్సా,ఛత్తీస్గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో శుక్రవారం ఢిల్లీ నుండి ప్రగతి ప్రాజెక్టుల మానిటరింగ్ గ్రూపు కో-చైర్మన్ అయిన కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ, రసాయన,ఎరువులు శాఖామాత్యులు మనీష్ మాండవీయ,మినిస్టర్ ఆఫ్ స్టేట్ ఇండిపెండెన్స్ చార్జీ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ,ఎర్త్ సైనెన్స్, మినిస్టర్ ఆఫ్ స్టేట్ ఫర్ పియంఓ ఫెర్సనల్ అండ్ పబ్లిక్ గ్రీవియెన్సెస్ డా.జితేంద్ర సింగ్ లు వీడియో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సిఎస్ ఆదిత్యా నాథ్ దాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో విజయనగరం-టిట్లాఘర్,నడికుడి-శ్రీకాళహస్తి,కడప-బెంగుళూరు రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి మిగతా భూమి సేకరించి అప్పగించేందుకు మరో మూడు మాసాలు సమయం కావాలని విజ్ఞప్తి చేయుగా కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించిందించి ఆగడువులోగా భూమి అప్పగించాలని చెప్పారు. ప్రగతి ప్రాజెక్టులను ప్రధాన మంత్రే స్వయంగా పర్యవేక్షిస్తున్నందున ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఈవిషయంలో అత్యంత శ్రద్ధ కనపర్చి ఆయా ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తయ్యేలా తోడ్పడాలని కేంద్ర మంత్రులు సూచించారు. వివిధ రాష్ట్రాల వారీ ప్రగతి ప్రాజెక్టులు పెండింగ్ అంశాలను వారు సిఎస్ లతో సమీక్షించారు. ఈసందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యా నాథ్ దాస్ మాట్లాడుతూ రైల్వే ప్రాజెక్టులకు భూమి సమీకరణకు ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరిస్తూ డిసెంబరు నెలాఖరు వరకు గడువు ఇవ్వాలని అప్పటికి మిగతా భూమి అప్పగింత ప్రక్రియను పూర్తి చేస్తామని వివరించారు. ఇప్పటికే ఆయా రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన అవసరమైన భూమిలో కొంతమేర రైల్వే శాఖకు అప్పగించగా మిగతా భూమిపై వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దీనిలో భాగంగా ప్రభుత్వ భూమిని గుర్తించడం తోపాటు ప్రైవేట్ భూమిని సేకరించి ఇచ్చేందుకు ఆయా భూమి యజమానులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు సిఎస్ ఆదిత్యా నాథ్ దాస్ కేంద్ర మంత్రులకు వివరించారు. ఇప్పటి వరకూ ఆయా ప్రాజెక్టులకు భూమి సమీకరించి అందించిన వివరాలను సిఎస్ కేంద్ర మంత్రులకు వివరించారు. అదేవిధంగా కొవ్వూరు- భద్రాచలం నూతన రైల్వే లైను నిర్మాణ ప్రాజెక్టు రాష్ట్ర విభజన అంశంలో ఉందని ఆప్రాజెక్టు అంశానికి సంబంధించి కూడా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని సిఎస్ ఆదిత్యా నాథ్ దాస్ పేర్కొన్నారు.

# దిశపై దుష్ప్రచారం బాధాకరం

విశాఖపట్నం మహిళ భద్రత కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని హోంమంత్రి మేకతోటి సుచరిత పేర్కొన్నారు. విశాఖపట్నం ఆర్కే బీచ్ వద్ద జరిగిన 1971 వార్ గోల్డెన్ జూబ్లీ విక్టరీ కార్యక్రమంలో పాల్గొన్న హోంమంత్రి మీడియా తో మాట్లాడటం జరిగింది. మహిళల భద్రత కోసం తీసుకొస్తున్న దిశ చట్టాన్ని ప్రతిపక్ష నాయకులు అవహేళన చూస్తూ మాట్లాడటం తగదని హోంమంత్రి అన్నారు. ఉద్దేశపూర్వకంగా కొందరు దిశ పోలీస్ స్టేషన్ల వద్ద ఆందోళన చేయడం బాధాకరమన్నారు. టీడీపీ నాయకులు దిశ చట్టమే లేదని అపహాస్యం చేస్తూ తీవ్ర ప్రచారం చేస్తున్నారు. కానీ రాష్ట్రంలో అనేక మంది మహిళలు దిశ యాప్ ద్వారా రక్షణ పొందుతున్నారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. దాదాపు 40 లక్షలమంది దిశ యాప్ ను డౌన్లోడ్ చేసుకున్నారని హోంమంత్రి స్పష్టంచేశారు. దాదాపు 1500 కేసుల్లో 7 రోజుల్లోనే ఛార్జ్‌షీటు వేయడం జరిగిందన్నారు. మహిళల రక్షణ విషయంలో ప్రతిపక్ష టీడీపీ నాయకులు సలహాలివ్వాల్సింది పోయి.. దుష్ప్రచారం చేయడం బాధాకరమన్నారు. కాలేజ్ విద్యార్థినిలు, మహిళలు దిశ యాప్ ను వాడటం వలన భద్రత లభిస్తోందని చెబుతున్నారు. కానీ ఇప్పుడు టీడీపీ నాయకులు మహిళల నమ్మకాన్ని వొమ్ము చేస్తున్నారని హోంమంత్రి మండిపడ్డారు. దిశ చట్టాన్ని, మహిళల భద్రత విషయాన్ని రాజకీయ లబ్ది కోసం వాడుకోవడం బాధాకరమన్నారు. దిశ వచ్చిన తరువాత ఎంత మంది మహిళలు దీని వలన రక్షణ పొందారు అనే మంచిని గ్రహించాలన్నారు. మహిళల భద్రతను బలోపేతం చేసేందుకు టీడీపీ నాయకులు సలహాలు ఇస్తే తప్పకుండా స్వీకరిస్తామని హోంమంత్రి మేకతోటి సుచరిత పేర్కొన్నారు.

# అడిషనల్ ఎస్పీ గా పదోన్నతి పొందిన నంద్యాల డి.ఎస్.పి చిదానంద రెడ్డి

నంద్యాల సెప్టెంబర్ 3, (న్యూస్ పల్స్): అడిషనల్ డిఎస్పి గా పదోన్నతి పొందిన నంద్యాల డిఎస్పి చిదానంద రెడ్డి కి ప్రగతి రూరల్ అండ్ ఎడ్యుకేషన్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగినది. శుక్రవారం కర్నూలు జిల్లా నంద్యాల లో డీఎస్పీ కార్యాలయంలో ప్రగతి రూరల్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు , ఎస్సీ ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్. ఓ .మమతా రెడ్డి డి.ఎస్.పి చిదానంద రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి మెమెంటో అందజేసి శుభాకాంక్షలు తెలపడం జరిగినది. ఈ సందర్భంగా మమతా రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తే ప్రజల మన్ననలు తో పాటు హోదా పెరుగుతుంది అని కొనియాడారు. మరియు ప్రగతి రూరల్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఎంతో మంది పేదలను ఆదుకునే వివిధ సేవ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలోనూ వర్షాలు



విజయవాడ, సెప్టెంబర్ 3, (న్యూస్ పల్స్)బంగాళాఖాతంలో దక్షిణ ఆంధ్ర ప్రదేశ్-ఉత్తర తమిళనాడు కోస్తా తీరాలకు దగ్గరగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది పశ్చిమ మధ్య ఆనుకొని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో సగటు సముద్రమట్టానికి 1.5 కిమీ నుండి 4.5 కిమీ ఎత్తుల మధ్య కొనసాగుతుందని ఏపీ వాతావరణ శాఖ తెలిపింది. ఆవర్తనం ఎత్తుకు వెళ్లే కొలది దక్షిణం వైపు వంగి ఉంది. ఈరోజు షీర్ జోన్ 10డిగ్రీ అక్షాంశం వెంబడి సగటు సముద్రమట్టానికి 5.8 కిమీ నుండి 7.6 కిమీ ఎత్తుల మధ్య ఏర్పడింది. దీంతో ఈ నెల 6న ఉత్తర, దానిని ఆనుకుని ఉన్న మధ్య బంగాళాఖాతాల్లో ఒక అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో ఏపీలో వివిధ ప్రాంతాల్లో రాగల మూడు రోజుల వరకు వాతావరణ పరిస్థితులు ఇలా ఉంటాయని అధికారులు తెలిపారు. ఉత్తర కోస్తా ఆంధ్ర, యానాం:×ఈరోజు ఉత్తర కోస్తా ఆంధ్రాలో ఉరుములు, మెరుపులుతో పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు చాలాచోట్ల కురిసే అవకాశం ఉంది. విశాఖపట్టణం, తూర్పు గోదావరి జిల్లాల్లో భారీ నుండి అతిభారీ వర్షాలు, పశ్చిమగోదావరి జిల్లాలో భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది.

# చిన్న పరిశ్రమల ద్వారా 10 లక్షల మందికి ఉద్యోగాలు

విజయవాడ, సెప్టెంబర్ 3, (న్యూస్ పల్స్)రాష్ట్రంలోని చిన్న తరహా పరిశ్రమలను రక్షించేందుకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఈ తరహా పరిశ్రమల్ని ఆదుకునేందుకు నేడు శ్రీకారం చుట్టామని తెలిపారు. తద్వారా 10 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలుకల్పిస్తున్నామని సీఎం చెప్పారు. పరిశ్రమలు తెచ్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్న సీఎం..రాష్ట్రంలో పెట్టుబడులుపెట్టేందుకుఅవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇన్సెంటివ్స్ ఇస్తుందన్న నమ్మకం కలిగించాలని సీఎం అన్నారు. గతంలో హడావుడి ఎక్కువగా.. పని తక్కువగా ఉండేదని చంద్రబాబు సర్కారుపై సీఎం జగన్ విమర్శలు చేశారు. కొప్పర్తిలో వైఎస్సార్ ఈఎంసీ పార్క్‌ను స్థాపిస్తున్నామని సీంఎం జగన్ తెలిపారు. రూ.10వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా వైఎస్సార్ ఈఎంసీ పార్క్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కరోనా కష్టకాలంలో వరుసగా రెండోఏడాదికూడాపరిశ్రమలకు ప్రోత్సాహకరాయితీలనురాష్ట్రప్రభుత్వం అందిస్తోందని జగన్ స్పష్టం చేశారు. కరోనా విపత్తు వల్ల రాష్ట్రంలో ఒక్క పరిశ్రమ కూడా మూతపడకూడదన్న లక్ష్యంతో ఈ ఏడాది కూడా ఎంఎస్ఎంఈలు, టెక్స్‌టైల్, స్పిన్నింగ్ మిల్లులకు రూ.1,124 కోట్ల ప్రోత్సాహకాలను అందిస్తోందని జగన్ తెలిపారు.

# పింఛన్ తొలగింపు చర్యలను ప్రభుత్వం వెంటనే మానుకోవాలి..

## తుగ్గలి మండలం తెలుగుదేశం పార్టీ



తుగ్గలి సెప్టెంబర్ 3,( విభారె) అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఉచితంగా అందజేసే పింఛన్ తొలగింపు చర్యలను ప్రభుత్వం వెంటనే మానుకోవాలని తుగ్గలి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పింఛన్ తొలగింపు చర్యలకు వ్యతిరేకంగా శుక్రవారం రోజున మండల కేంద్రమైన తుగ్గలిలోని స్థానిక ఎంపిడిఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి నిరసనను వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం రోజు రోజుకు కొత్త కొత్త నిబంధనలను ఏర్పాటు చేసి ప్రభుత్వ ఉచిత పథకాలకు సంబంధించి లబ్ధిదారుల సంఖ్యను తక్కువ చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందని వారు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి సరిగ్గా నెరవేర్చడం లేదని వారు నిరసన వ్యక్తం చేశారు.కొత్త కొత్త నిబంధనలతో ప్రభుత్వ పథకాలు సరిగ్గా అందక రాష్ట్రంలో గల పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు తెలియజేశారు.వచ్చే ఎన్నికలలో ప్రజలు తగిన గుణపాఠం నేర్పుతారని వారు హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసి,ప్రజల పై పెను భారాన్ని మోపుతోందని వారు తెలియజేశారు.తెలుగుదేశం ప్రభుత్వంలో ఎటువంటి నిబంధనలు లేకుండా అందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు చేపట్టామని,కానీ వైఎస్సార్ ప్రభుత్వంలో రోజుకొక నిబంధనలను ఏర్పాటు చేసి పింఛన్లను తొలగించడం సరైన పద్ధతి కాదని వారు తెలియజేశారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తొలగించిన పింఛన్ పునరుద్ధరించి లబ్ధిదారులకు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని తుగ్గలి మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు తుగ్గలి ఎంపీడీవో వీర రాజు కు వినతి పత్రాన్ని అందజేశారు.అదే విధంగా ఇచ్చిన మాట ప్రకారం 3000 రూ పింఛన్ ఎప్పటి నుండి లబ్ధిదారులకు అందజేస్తారో తెలియజేయాలని వారు ఎంపీడీవో అందజేశారు.ఈ కార్యక్రమంలో తుగ్గలి మండల తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ తిరుపాల్ నాయుడు,మాజీ ఎంపీపీ కొమ్మ వెంకటేష్,వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఉప్పర్లపల్లే శీనప్ప,తిమ్మయ్య చౌదరి,చెన్నంపల్లి లక్ష్మీ నారాయణ,రాము నాయక్,తెలుగు యువత మండలాధ్యక్షులు సత్య ప్రకాష్,రాతన ఈరమ్మ,తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అడిషనల్ ఎస్పీ గా పదోన్నతి పొందిన నంద్యాల డి.ఎస్.పి చిదానంద రెడ్డి

నంద్యాల సెప్టెంబర్ 3,( విభారె). : అడిషనల్ డిఎస్పి గా పదోన్నతి పొందిన నంద్యాల డిఎస్పి చిదానంద రెడ్డి కి ప్రగతి రూరల్ అండ్ ఎడ్యుకేషన్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగినది. శుక్రవారం కర్నూలు జిల్లా నంద్యాల లో డీఎస్పీ కార్యాలయంలో ప్రగతి రూరల్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు , ఎస్సీ ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్. ఓ .మమతా రెడ్డి డి.ఎస్.పి చిదానంద రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి మెమెంటో అందజేసి శుభాకాంక్షలు తెలపడం జరిగినది. ఈ సందర్భంగా మమతా రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తే ప్రజల మన్ననలు తో పాటు హోదా పెరుగుతుంది అని కొనియాడారు. మరియు ప్రగతి రూరల్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఎంతో మంది పేదలను ఆదుకునే వివిధసేవ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# జర్నలిస్టులను సమాజానికి దూరం చేయాలని ప్రభుత్వ కుట్ర ..!



తాత్కాలిక అక్రిడిటేషన్ లుజర్నలిస్టులనుఅవమానించడమే...!!

జర్నలిస్టులందరికీ పూర్తికాలపు అ క్రిడిటేషన్ లు మంజూరు చేయాలి :

ఏపీడబ్ల్యూజే ఎఫ్ నిరసన దీక్షలో రాజకీయ, జర్నలిస్టు సంఘాల నేతల డిమాండ్

కర్నూలు సెప్టెంబర్ 3,( విభారె). స్థానిక పత్రికల జర్నలిస్టులను సమాజానికి దూరం చేయాల నే కుట్రలో భాగంగానే ఏపీ ప్రభుత్వం జర్నలిస్టుల అక్రిడేషన్ల లో కోత విధిస్తోం దని పలువురు రాజకీయ ,జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు తీవ్రంగా మండిపడ్డారు .తాత్కాలిక అ క్రిడిటేషన్ లు మంజూరు చేస్తామన డం జర్నలిస్టులను తీవ్రంగా అవమానించడమేనని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని స్థానిక పత్రికల విలేకరులు, కేబుల్ ఛానల్ ల విలేకర్లనీదరికీ బేషరతుగా పూర్తి కాలపు అక్రిడేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని వారు ఏపీ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలులో ఏపీ డబ్ల్యూ జే ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు పలువురు రాజకీయ నాయకులు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు హాజరై సంపూర్ణ సంఘీభావం తెలిపారు. అన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ సత్తార్, తెలుగుదేశం పార్టీ నంద్యాల పార్లమెంటు అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి, సిపిఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కే ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొని దీక్ష చేపట్టిన జర్నలిస్టులకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం జర్నలిస్టుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలని హితవు పలికారు .రాష్ట్రంలో పనిచేస్తున్న విలేకర్లనీదరికీ చిన్న ,పెద్ద భేదం లేకుండా ప్రెస్ అక్రిడిటేషన్ కార్డులు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులతో పెట్టుకున్న ప్రభుత్వాలు ఎక్కువ కాలం మనుగడ సాగించలే వని, జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం ఈ విషయాన్ని గమనించి వెంటనే జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని గౌరు వెంకటరెడ్డి సూచించారు.

# పురుగు మందుల వాడకం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి...

## ఎడిఎ మహమ్మద్ ఖాద్రి

తుగ్గలి/మద్దికేర సెప్టెంబర్ 3,( విభారె) మొట్టమొదటగా రైతులు పురుగుల మందులన్నీ విష పదార్థాలే అని గ్రహించాలి.అవి తయారయ్యే కర్మాగారాలలో నిల్వ ఉంచే గిడ్డంగిల్లోరైతు పైరుపై చల్లే సమయాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.అందువల్ల పురుగుమందుతో జాగ్రత్తగా వ్యవహరించాలని పత్తికొండ వ్యవసాయశాఖ ఏడీఏ మహమ్మద్ ఖాద్రి రైతులకు సూచించారు.జాగ్రత్తలు తీసుకున్నా కొన్ని సందర్భాల్లో అనుకోని విధంగా పురుగు మందుల విషప్రభావానికి లోనవుతారని, అందుకు తగ్గ లక్షణాలను గుర్తించి ప్రథమచికిత్స చేపట్టాలని పేర్కొన్నారు.పురుగుమందులు మానవ శరీరంలోకి మూడు విధాలుగా చేరడానికి అవకాశం ఉంది...చర్మం ద్వారా:శరీరంపై పురుగుమందులు పడినప్పుడు చర్మం ద్వారా విషపదార్థం శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఒంటిపై పుండ్లు, గాయాలు ఉన్నప్పుడు మరింత సులభంగా, త్వరగా శరీరంలోకి ప్రవేశిస్తుంది.ముక్కు ద్వారా... పురుగుమందుల ద్వారా వెలువడే వాయువులు,ధూళి అణువులు గాలిని పీల్చడం వల్ల ముక్కు ద్వారా శరీరంలోకి విషపదార్థాలు ప్రవేశించి హాని కలిగిస్తాయి.నోటి ద్వారా.... పురుగు మందులను వాడిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోకపోవడం వల్ల పురుగుమందుల అవశేషాలు పరిమితికి మించి ఉండే ఆహార పదార్థాలు తినడం వల్ల నోటి ద్వారా శరీరంలోకి వెళ్లే ప్రమాదముంది. ఒక్కొక్కప్పుడు మరణం సంభవిస్తుంది.ప్రథమ చికిత్స...× చర్మం ద్వారా విషపదార్థం ప్రవేశించినప్పుడు వెంటనే మంచి నీటితో సబ్బు ఉపయోగించి శుభ్రంగా కడగాలి. కంటిలో పడినప్పుడు కూడా మంచి నీటిని అధికంగా ఉపయోగించి కడుక్కోవాలి. చికిత్సకోసం వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.× ముక్కుతో పీల్చినప్పుడు



విషపదార్థం శరీరంలోకి ప్రవేశించినపుడు విష ప్రభావానికి లోనైన వ్యక్తిని వెంటనే కలుషిత వాతావరణం నుంచి దూరంగా తీసుకెళ్ళాలి. బాగా గాలి వచ్చే పరిశుభ్రమైన వాతావరణంలో కి మార్చాలి. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉన్నా, పూర్తిగా ఆగిన వెంటనే కృత్రిమ శ్వాస కల్పించాలి. వైద్యుని వద్దకు తీసుకెళ్లే వరకు కృత్రిమశ్వాస అందిస్తూ ఉండాలి. విష ప్రభావానికి లోనైన వ్యక్తిని వీలైనంత త్వరగా చికిత్స కోసం వైద్యుని వద్దకు తీసుకెళ్లాలి.× నోటి ద్వారా విషపదార్థం తీసుకున్నపుడు కడుపులో నుంచి బయటికి రావడానికి వెంటనే వాంతి చేయించాలి. గ్లాసు వేడి నీళ్లలో ఒక స్పూన్ ఉప్పు లేక ఆవాల పొడి కలిపి తాపించాలి. గొంతులో వేళ్ళు పెట్టి కక్కించాలి. ఇలా కడుపులో పదార్థం ఖాళీ అయ్యే వరకు చేయాలి. 8 గ్రాముల ఛార్ కోల్, 4 గ్రాముల ట్యానిక్ యాసిడ్, 4 గ్రాముల మెగ్నీషియం ఆక్సైడ్ రసాయనాలను అరగ్లాసు వేడి నీళ్లలో కలిపి తాగించాలి. పాలు, గుడ్డులోని తెల్లసొన, జలటీన్, లేపనం ఇస్తే జీర్ణాశయం, లోపలి భాగానికి హానీ జరుగదు. వెంటనే వైద్యున్ని సంప్రదిస్తే జీర్ణాశయం, చిన్న ప్రేగులు వీలైనంత శుభ్రం అయ్యేలా చేస్తారు.

## కశ్మీర్ ముస్లింల గురించి మాట్లాడే హక్కు మాకుంది!

కాబూల్: తాలిబన్లు మరోసారి మాట మార్చారు. ఆఫ్ఘనిస్థాన్‌ను మళ్లీ చేతుల్లోకి తీసుకున్న తర్వాత చెప్పిన మాటలకు, ఇప్పుడు చేస్తున్న పనులకు పొంతన లేకుండా ఉంది. తాజాగా కశ్మీర్ విషయంలోనూ తాలిబన్లు మాట మార్చారు. వచ్చిన కొత్తలో కశ్మీర్ అంతర్గత విషయమని, అది ఇండియా, పాకిస్థాన్ ద్వైపాక్షిక అంశమన్న వాళ్లు.. ఇప్పుడు కశ్మీర్ ముస్లింల గురించి మాట్లాడే హక్కు తమకుందని అనడం గమనార్హం. బీబీసీ ఉర్దూతో మాట్లాడిన తాలిబన్ అధికార ప్రతినిధి సుహైల్ షహీన్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఈ హక్కు మాకుంది. ముస్లింలుగా కశ్మీర్, ఇండియా సహా ఏ దేశంలోని ముస్లింల కోసమైనా గళమెత్తే హక్కు మాకు ఉంది అని షహీన్ అన్నాడు.అయితే ఏ దేశంపైనా తాము ఆయుధాలు ఎక్కుపెట్టబోమని కూడా అతను స్పష్టం చేశాడు.

# ట్రెండీ టాక్: డియర్ తేజ.. ఎక్కడుంది లోపం?



స్టార్ డైరెక్టర్ తేజ టాలీవుడ్ లో ఎన్నో విజయవంతమైన చిత్రాలు తెరకెక్కించిన సంగతి తెలిసిందే. నవతరం హీరోలను తెరకు పరిచయం చేసి బ్లాక్ బస్టర్లు కొట్టడం ఆయన ప్రత్యేకత. కథే బలంగా ఆయన చిత్రాలు సాగుతుంటాయి. కేవలం కంటెంట్ తో హిట్ కొట్టే దర్శకుల్లో ముందుండే పేరు ఆయనదే. తేజ కెరీర్ మొత్తం చూస్తే స్టార్ హీరోతో చేసిన సినిమా ఏదైనా ఉంది ! అంటే 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రం ఒక్కటే అవుతుంది. టాలీవుడ్ హంక్ రానా కథానాయకుడిగా తెరకెక్కించిన ఆ చిత్రం మంచి విజయం సాధించింది. పొలిటికల్ సెటైరికల్ బ్యాక్ డ్రాప్ లో సాగిన చిత్రంతో తేజ లో మరో కోణం ఆవిష్కృతం అయింది.తేజలో ఈ యాంగిల్ కూడా ఉందని టాలీవుడ్ మొత్తం ముక్కున వేలేసుకుంది. ఆ తర్వాత కాజల్ అగర్వాల్ తో 'సీత 'అనే లేడీ ఓరియెంటెడ్ చిత్రం తెరకెక్కించారుగానీ పెద్దగా సక్సెస్ అవ్వలేదు. ఆ వెంటనే మళ్లీ రామానాయుడు కాంపౌండ్ లోనే విక్టరీ వెంకటేష్ తో ఓ సినిమా చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ ఆ సినిమా ఇప్పటివరకూ రూపు దాల్చలేదు. దీంతో ఈ సినిమా రద్దయిందని ప్రచారం సాగుతోంది. అంతేకాదు వెంకీకి వినిపించిన కథతోనే గోపీచంద్ ని లాక్ చేసినట్లు ప్రచారమైంది. చాలా కాలం క్రితమే 'అలివేలు వెంకటరమణ' అనే టైటిల్ ని కూడా ఖరారు చేసారు. తాజాగా ఈ ప్రాజెక్ట్ కూడా ఆగిపోయిందని ప్రచారం సాగుతోంది.ఈ సినిమా కోసం స్టార్ హీరోయిన్ ని దించాలని తేజ గట్టి ప్రయత్నాలే చేసినట్లు తెలిసింది. అనుష్క..సమంత..సాయి పల్లవి.. కీర్తి సురేష్ లను సంప్రదించారట. చివరిగా కీర్తి సురేష్ గ్రీన్ సిగ్నెల్ ఇచ్చారు. పీపుల్స్ మీడియా ప్యాక్టరీ కూడా నిర్మాణానికి రెడీ అవుతోందిట. కానీ ఇంతలోనే ఏమైందో.. బ్యాడ్ న్యూస్.. ఈ సినిమా ఆగిపోయినట్లు మీడియాలో కథనాలొస్తున్నాయి.దీంతో పాటు రానాతో తేజ మరో చిత్రం కూడా తెరకెక్కిస్తున్నట్లు ఓ ప్రకటన వచ్చింది. అదే 'రాక్షసరాజు రావణాసురుడు'. కానీ ఈ సినిమా గురించి రానా స్పందించలేదు. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో తన చేతిలో కేవలం రెండు చిత్రాలే ఉన్నాయని అన్నారు. 'మిలిందరావు' ..హిరణకశ్యప చిత్రాల గురించే ఆయన మాట్లాడారు. అలాగే తేజ కూడా ఈ సినిమా గురించి ఈ మధ్య కాలంలో ఎక్కడా మాట్లాడింది లేదు. దీంతో ఈ ప్రాజెక్ట్ కూడా అటకెక్కినట్లే కనిపిస్తోంది. ఏక కాలంలో తేజ ప్లాన్ చేసుకున్న చిత్రాలన్ని ఇలా అనూహ్యంగా రద్దవడం వెనుక అసలు కారణాలు ఏమై ఉంటాయో తెలియాల్సి ఉంది.ట్యాలెంటెడ్ దర్శకుడిలో ఆ కోణం ఏమైంది?అసలు తేజ అంటేనే ప్రేమకథా చిత్రాలకు యూత్ ఫుల్ ఎంటర్ టైనర్లకు కేరాఫ్ అడ్రెస్. ప్రతిసారీ కొత్త ముఖాన్ని తెరకు పరిచయం చేసి సంచలనాలు సృష్టించడం తనకే చెల్లింది. పరిశ్రమలకు ఉదయ్ కిరణ్.. నితిన్ లాంటి హీరోలను పరిచయం చేసింది తేజనే. ఒక చిత్రం తో ఆది పినిశెట్టిని.. మొదటి సినిమాతో నవదీప్ ని హీరోల్ని చేసారు తేజ. అనిత.. సదా లాంటి కథానాయికల్ని పరిచయం చేసి లైఫ్ నిచ్చారు. కమెడియన్ సునీల్ ని... సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ ని పరిచయం చేసింది ది గ్రేట్ తేజ. ఫుల్ క్రైసిస్ లో ఉన్న గోపిచంద్ ని విలన్ ని చేసి బ్రేక్ ఇచ్చింది తేజనే. వీరంతా పెద్ద స్థాయికి ఎదిగారంటే అది తేజ వేసిన ఫౌండేషన్ అనే చెప్పాలి. కానీ ఇటీవలి కాలంలో వీళ్లెవరూ తేజ వెంట ఉన్నట్టు లేదు. ఉదయ్ కిరణ్ బలవన్మరణం తెలిసినదే. నితిన్ ప్రస్తుతం ట్రెండీ దర్శకులతో పని చేస్తున్నారు. గోపిచంద్ కానీ.. సునీల్ కానీ ఇటీవల తేజతో సినిమాలు చేసిందేమీ లేదు. బహుశా తేజ స్ట్రగుల్ లైఫ్ వల్ల వీరంతా డిస్కనెక్ట్ అయ్యారా? లేక తన అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవడంలోనో లేదా ఛాన్సుల్ని క్రియేట్ చేసుకోవడంలోనో ఆయనలో ఏదో తేడా జరుగుతోందా? ఏదేమైనా తేజకు పాత రోజులు తిరిగి రావాలని ఆకాంక్షిద్దాం. వరుసగా వెబ్ సిరీస్ లు .. వెబ్ కంటెంట్ తో కొత్త తరం కుర్రాళ్లు కూడా షైన్ అవుతుంటే తేజ ఎందుకనో వీటన్నిటికీ దూరంగా ఉన్నారు.. రీజన్ ఏంటో ఆయనే చెబుతారేమో?

# అడవులను వదలని పుష్పరాజ్.. ఏంటి కథ?

ఆంధ్రప్రదేశ్ గోదావరి పరిసరాల్లోని మారేడుమిల్లిలో నిధినిక్షేపాలు దాగి ఉన్నాయా? ఏమో పదే పదే పుష్ప రాజ్ ఇక్కడి అడవులకు రిపీటెడ్ గా తిరిగేస్తుండడం చూస్తుంటే రకరకాల సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అల్లు అర్జున్ – రష్మిక మందన్న– ఫహద్ ఫాజిల్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న 'పుష్ప' పాన్–ఇండియా యాక్షన్ డ్రామా కథాంశంతో తెరకెక్కుతోంది.గంధపు చెక్కల స్మగ్లర్ల కథతో ఈ సినిమా రూపొందుతోంది. ఈరోజు చివరి షెడ్యూల్ ప్రారంభం కానుంది. చిత్ర బృందం మారేడుమిల్లికి బయలుదేరింది. ఇక్కడ రెండు వారాల్లో మొత్తం షూటింగ్ ఫార్మాలిటీలను పూర్తి చేయనుంది.దసరా బరిలో పుష్ప రిలీజవుతుందని ప్రచారమైనా.. క్రిస్మస్ సీజన్ కి వాయిదా పడిందని ఇటీవల కథనాలొచ్చాయి. ఈ సినిమా కి దేశవ్యాప్తంగా సినీ ప్రేమికుల నుంచి అద్భుతమైన స్పందన వస్తుందని దర్శకుడు సుకుమార్ రాజీకి రాని రీతిలో తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో మలయాళీ ట్యాలెంటెడ్ నటుడు ఫహద్ ఫాజిల్ విలన్ గా నటిస్తుండగా.. యువ శాండల్ వుడ్ నటుడు ధనంజయ కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. ఫహద్ లుక్ ని ఇటీవల రిలీజ్ చేయగా అంతర్జాలంలో వైరల్ అయ్యింది. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ తో కలిసి ముత్తంశెట్టి మీడియా ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ ను నిర్మిస్తోంది. దేవీశ్రీ సంగీతం అందిస్తున్నారు.కమల్ స్ఫూర్తితో బన్నీ హార్డ్ వర్క్..విశ్వనటుడు కమల్ హాసన్ 'భారతీయుడు' సేనాపతి లుక్ కోసం రోజుకు 4 గంటలు మేకప్ కే టైమ్ కేటాయించేవారు. ఆ తర్వాత దశావతారం కోసం ఏడెనిమిది గంటలు మేకప్ కోసమే వెయిట్ చేసేవారని విన్నాం. ఇటీవల విశ్వరూపం వేషధారణ కోసం కమల్ అంతే అంకితమయ్యారు.స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ కూడా కమల్ హాసన్ ని స్ఫూర్తిగా తీసుకుని పుష్ప కోసం మేకప్ పరంగా వైవిధ్యం పాటిస్తున్నారు.యాక్షన్ థ్రిల్లర్ పుష్పలో బన్నీ పూర్తి మాస్ అవతారంలో కనిపించనున్నారు.








# ఢిల్లీ పగ్గాలు పంత్‌కే.. శ్రేయస్‌కు భంగపాటు



దుబాయ్: ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న రిషబ్ పంత్‌ను సారథ్య బాధ్యతల్లో యధావిధిగా కొనసాగించాలని ఢిల్లీ యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. యూఏఈ వేదికగా ఈనెల 19 నుంచి జరిగే ఐపీఎల్ మలి దశ మ్యాచ్‌లకు పంత్‌ను తప్పించి, శ్రేయస్ అయ్యర్‌కు తిరిగి కెప్టెన్సీ పగ్గాలు అప్పగిస్తారన్న ఊహాగానాల నేపథ్యంలో డీసీ యాజమాన్యం క్లారిటీ ఇచ్చింది. భుజం గాయం కారణంగా గత కొంతకాలంగా క్రికెట్ దూరంగా ఉన్న శ్రేయస్ అయ్యర్‌కు కెప్టెన్సీ అప్పగించి ప్రయోగం చేయదలచుకోలేదని ప్రకటించింది. ప్రస్తుతం శ్రేయస్ గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడని, ఆటగాడిగా జట్టుకు సేవలందిస్తాడని స్పష్టం చేసింది. కాగా, గాయం కారణంగా భారత్ వేదికగా జరిగిన ఐపీఎల్ మొదటి దశ మ్యాచ్‌లకు శ్రేయస్ దూరం కావడంతో పంత్ డీసీ పగ్గాలు చేపట్టిన విషయం తెలిసిందే. పంత్ సారథ్యంలో డీసీ తొలి దశ మ్యాచ్‌లలో వరుస విజయాలు(8 మ్యాచ్‌ల్లో 6 విజయాలు) సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు గత రెండున్నర సీజన్లుగా డీసీ జట్టును శ్రేయస్ అయ్యర్ అద్భుతంగా ముందుండి నడిపించాడు. అతని సారథ్యంలో ఢిల్లీ క్యాపిటల్స్ గతేడాది ఫైనల్స్‌కు కూడా చేరింది. ఇదిలా ఉంటే, డీసీ జట్టు ఐపీఎల్ సెకెండ్ లెగ్ తొలి మ్యాచ్‌ను సెప్టెంబర్ 22న సన్‌రైజర్స్‌తో ఆడనుంది.

## ప్రత్యర్థి ఆటగాడి చెంప చెల్లుమనిపించాడు, ఆ తర్వాత..?

పోర్చుగల్: దిగ్గజ ఫుట్‌బాలర్, పోర్చుగల్ స్టార్ ప్లేయర్ క్రిస్టియానో రొనాల్డో ఫిఫా ప్రపంచ కప్ క్వాలిఫయర్స్ పోటీల్లో భాగంగా ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్ చివరి నిమిషంలో రెండు గోల్స్ సాధించి తన జట్టును గెలిపించాడు. ఈ రెండు గోల్స్‌తో రొనాల్డో అంతర్జాతీయ గోల్స్ సంఖ్య 111కు చేరింది. దీంతో అత్యధిక అంతర్జాతీయ గోల్స్ సాధించిన ఆటగాళ్ల జాబితాలో ఇరాన్ దిగ్గజ ఆటగాడు అలీ దాయ్ (109)ను దాటి అగ్రస్థానంలోకి దూసుకెళ్లాడు. ఇదిలా ఉంటే, ఇదే మ్యాచ్‌లో రొనాల్డో చేసిన ఓ పని ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. ఆట ప్రారంభమైన 15వ నిమిషంలో పోర్చుగల్‌కు పెనాల్టీ లభించింది. ఈ పెనాల్టీ కిక్‌ను రొనాల్డో తీసుకున్నాడు. అయితే, బంతిని కిక్ చేయడానికి పొజిషన్‌లో పెట్టుకున్న సమయంలో ఐర్లాండ్ డిఫెండర్ ఓషియా దాన్ని కాలితో తన్నాడు. దీంతో ఆగ్రహానికి గురైన రొనాల్డో అతడి భుజంపై బలంగా కొట్టాడు. రొనాల్డో కొట్టిన దెబ్బకు ఓషియా కాసేపు ఓవరాక్షన్ చేశాడు. రొనాల్డోకు అంపైర్ రెడ్ కార్డ్ వస్తుందని నానా డ్రామా చేశాడు. అయితే ఈ తతంగాన్ని రిఫరి గమనించకపోవడంతో రొనాల్డో రెడ్ కార్డ్ బారి నుంచి తప్పించుకున్నాడు. ఒకవేళ రొనాల్డోకి రెడ్ కార్డు చూపించి ఉంటే.. అతను మైదానం వీడాల్సి వచ్చేది. అప్పుడు చివర్లో రెండు గోల్స్ కొట్టే అవకాశం ఉండేది కాదు. కాగా, మైదానంలో ప్రత్యర్థులపై ఇలా దురుసుగా ప్రవర్తించడం సీఆర్7కు కొత్తేమీ కాదు. గతంలో చాలా సందర్భాల్లో ఉద్దేశపూర్వకంగా అతను దాడులకు పాల్పడి మైదానం వీడాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**